epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
SAMAYAM

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 139 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 21 మార్చి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్



## అసెంబ్లీలో ప్రవేశపెట్టిన డిప్యూటి సీఎం భట్టి

### రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు
### మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లు

- ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు
- 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా
- జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయింపు
- విద్య, నైపుణ్యాభివృద్ధికి రూ. 26,674 కోట్లు కేటాయింపు
- వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
- పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
- విద్యా శాఖకు రూ.26,674 కోట్లు
- వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
- కార్మిక శాఖకు రూ.998 కోట్లు
- మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు
- ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు,
- ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు

2



తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. . సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 బ్జడెట్‌లో ప్రజా క్షేమం -సామాజిక న్యాయం అనే నినాదంతో ముందుకు సాగింది. ముందుగా అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రివర్గం సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని తెలిపారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు.



## ది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్

### సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చిట్‌చాట్

**హైదరాబాద్, మార్చి 20:** అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌పై అసెంబ్లీలో ఆయన చిట్‌చాట్ మాట్లాడుతూ

మిగతా 2వ పేజీలో..

### బడ్జెట్ ప్రతులకు పూజలు

- శాసన సభ వద్ద భట్టికి అధికారుల స్వాగతం

**హైదరాబాద్, మార్చి 20:** రాష్ట్ర శాసనసభలో 202627 వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతన్న సందర్భంగా ప్రజాభవన్‌లో నల్ల పోచమ్మ అమ్మవారికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్జెట్ ప్రతులను అమ్మవారి

మిగతా 2వ పేజీలో..



### బాకీ కార్డులతో గన్‌పార్కు వద్ద బీఆర్ఎస్ నిరసన

**హైదరాబాద్, మార్చి 20:** కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యంపై గన్ పార్క్ వద్ద భారత రాష్ట్ర సమితి (బీఆరఎస్) పార్టీ వర్కింగ్

మిగతా 2వ పేజీలో..

## శాసనసభ సోమవారానికి వాయిదా

- బడ్జెట్ ప్రసంగాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్



**హైదరాబాద్, మార్చి 20:** తెలంగాణ శాసనసభ సోమవారానికి వాయిదా పడింది. 202627 ఆర్థిక సంవత్సరానికి

మిగతా 2వ పేజీలో..

## రెండేళ్లలోనే రికార్డుస్థాయిలో పెట్టుబడులు

- రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నాం
- నాలుగోసారి బడ్జెట్‌కు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు
- విమర్శలు కాదు.. సూచనలు చేయండి
- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతూ ప్రసంగించిన భట్టి



2



## అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణ కేంద్రం

- ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మార్చి 20:** అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణ కేంద్రం (ఎస్ఐడీఎం) ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

మిగతా 3వ పేజీలో..

## అవినాశ్ రెడ్డికి రెగ్యులర్ బెయిల్ మంజూరు

5

## ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్, మార్చి 20:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 వార్షిక బడ్జెట్ అత్యంత నిరాశాజనకంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు విమర్శించారు. బడ్జెట్‌పై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బహుశా పొరపాటున గత ఏడాది బడ్జెట్‌నే చదివారేమో అన్న అనుమానం కలుగుతోందని, ఎందుకంటే పోయినసారి బడ్జెట్ కన్నా ఇందులో పెద్దగా మార్పులు చేర్పులు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా

మిగతా 3వ పేజీలో..

## కుటుంబ ఆస్తుల పంపకం జరగలేదు



- వైఎస్ ఉన్నంతవరకు ఆస్తులన్నీ ఉమ్మడివే
- జగన్ ఇప్పటికైనా చెల్లి, పిల్లలకు న్యాయం చేయాలి
- వైఎస్ విజయమ్మ సంచలన ప్రకటన


5

## అకాల వర్షంతో అన్నదాత కుదేలు

- దెబ్బతిన్న పలు రకాల పంటలు
- భారీగా నష్టపోయామని ఆందోళన
- ఆదుకుంటామన్న మంత్రి అచ్చన్నాయుడు

5

## పంట నష్టం అంచనాలు రెండ్రోజుల్లో తేల్చాలి



ఎల్పీజీ సరఫరాకు అంతరాయం కలగద్దు సీఎం చంద్రబాబు ఆదేశం

5



## శాసనసభ సోమవారానికి వాయిదా

**మొదటిపేజీ తరువాయి**

గాను వార్షిక బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సభలో శుక్రవారం ప్రవేశపెట్టారు. రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రసంగం పూర్తి అయిన అనంతరం స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. కాగా, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం కొనసాగుతుండగానే సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. అన్ని వర్గాలను మోసం చేశారంటూ చెవిలో పూలు పెట్టుకుని ఆ పార్టీ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను చించివేశారు. బడ్జెట్ మొత్తం మోసం.. మోసం అంటూ సభలో నిరసనలు తెలిపింది. ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవంటూ సభ నుంచి వాకౌట్ చేశారు. వారి వాకౌట్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. మీడియాతో ఆయన చిట్‌చాట్ మాట్లాడుతూ మాట్లాడుతూ బడ్జెట్ ప్రసంగం ముగిసే వరకు ఆర్థికి మంత్రి భట్టి విక్రమార్క నీళ్ళు కూడా తాగలేదన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు పువ్వులు పెట్టుకొని వెళ్లిపోయారని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్ రావు బడ్జెట్ ప్రతులను చించివేయడం బాధాకరమన్నారు. ఈ బడ్జెట్ పేదలు, బీసీ, ఎస్సీ, విద్యార్థులకు ఉపయోగకరమైనదన్నారు. పేదలు, విద్యార్థుల గురించి మాట్లాడే సమయంలోనే వాళ్ళు వెళ్ళిపోయారని నాగేందర్ అన్నారు.



## ది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతుల కల్పనకు సరిపడ నిధుల కేటాయింపు జరిగిందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్ పెద్ద పీట వేసిందన్నారు. అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించామని, దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ పథకం ద్వారా రూ.5 లక్షల బీమా పరిహారం అందిస్తామన్నారు. రాష్ట్రంలోని దాదాపు కోటి 15లక్షల కుటుంబాలకు ఈ పథకం వర్తించనుందన్నారు. విద్యారంగంలో సంస్కరణలకు, ప్రజారోగ్య సంరక్షణకు అత్యధిక నిధులు కేటాయించామని, జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో కూడా మార్పులు తీసుకు వస్తున్నామని, ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టు వరకు విద్యార్థులు ఒకేచోట ప్రభుత్వ స్కూల్లో చదివే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. అప్పులు, ఆదాయానికి సంబంధించి పారదర్శకంగా అన్ని వివరాలు వెల్లడించామన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు చేసిన అప్పు రూ.3.47లక్షల కోట్లు. ఇందులో నుంచి గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకే 3.30 లక్షల కోట్లు చెల్లించామని తెలిపారు. రాష్ట్ర ఆదాయం పెంచుకునేందుకు వివిధ విభాగాల్లో ఉన్న లీకేజీలను అరికడుతున్నామని, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు తెచ్చుకుంటున్నామని సీఎం చెప్పారు.



## బాకీ కార్డులతో గన్‌పార్కు వద్ద బీఆర్ఎస్ నిరసన

**మొదటిపేజీ తరువాయి**

ప్రెసిడెంట్ కేటీఆర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ప్లకార్డులతో శుక్రవారం నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన బాకీ కార్డులు ప్రదర్శిస్తూ ప్రజలను మోసం చేసిన విధానాన్ని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఎండగట్టారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ నిరసనలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా తెలంగాణను ఆగం చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. దివ్యాంగులకు బాకీ పడ్డ రూ.54,000 ఎక్కడ అని నిలదీశారు. నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటూ ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన రూ.24,000లలో సంవత్సరానికి రూ.12,000 చొప్పున రెండు సంవత్సరాలుగా బాకీ ఉందని విమర్శించారు. వృద్ధులకు ఇవ్వాల్సిన నెలకు రూ.4,000 చొప్పున మొత్తం రూ.54,000 బాకీ ఎక్కడ అని నిలదీశారు. పేదింటి ఆడబిడ్డలకు ఇస్తామని చెప్పిన తులం బంగారం ఏమైందని అడిగారు. రాష్ట్ర సంపదను దోచుకుంటూ రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

## బడ్జెట్ ప్రతులకు పూజలు

**మొదటిపేజీ తరువాయి**

ముందుంచారు. అనుకున్నమేర రాష్ట్రప్రభుత్వానికి ఆదాయం సమకూరి సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత ఎక్కువగా చేరాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం అంతా సుభిక్షంగా ఉండాలని కూడా ప్రార్థించారు. అనంతరం బడ్జెట్ ప్రతులతో శాసనసభలో జరుగుతున్న మంత్రిమండలి సమావేశానికి బయలుదేరారు. అసెంబ్లీకి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ అండ్ ఫైనాన్స్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ డి.కృష్ణ భాస్కర్, అసెంబ్లీ సెక్రటరీ తిరుపతి. శాసనమండలి సెక్రటరీ నరసింహాచార్యులు స్వాగతం పలికారు.

# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

- బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు
- మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు
- ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు
- యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు
- మహాలక్ష్మీ పథకం.. రూ.4,305 కోట్లు
- ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు,
- రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు



**హైదరాబాద్, మార్చి 20 :**

తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. . సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026 27 బడ్జెట్‌లో ప్రజా క్షేమం సామాజిక న్యాయం అనే నినాదంతో ముందుకు సాగింది. ముందుగా అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రివర్గం సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌలిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని తెలిపారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్ రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్ర తాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన - ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లో బీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకార వేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు. కేటాయింపులను పరిశీలిస్తే వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మీ పథకం రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్ 2 రూ.600 కోట్లు, మహాలక్ష్మీ గ్యాస్ సబ్సిడీ పథకం రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.1143 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ రూ.3500 కోట్లు, మహాలక్ష్మీ పథకం రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు రూ.5,500 కోట్లు, చేయూత పథకం. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.

**విద్యార్థులకు శుభవార్త : ఇంటర్‌లో బ్రేక్‌ఫాస్ట్ పథకం**

విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రాష్ట్రంలోని ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు అందరికి బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అందిస్తామని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. బడ్జెట్‌లో ఈ ప్రతిపాదనలను ఉంచారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుని వస్తున్నామన్నారు. ఈ పథకాలను 202627 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు వివరించారు. శుక్రవారం తెలంగాణ అసెంబ్లీలో ఈ ఏడాది వార్షిక బడ్జను ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. దివ్యాంగ, శారీరక వైకల్య విద్యార్థులకు రెట్రో ఫిటెడ్ మోటరైజ్‌డ్ వాహనాల పంపిణీ చేస్తామని తెలిపారు. సంక్షేమ స్కూళ్లలో వసతుల మెరుగుకు చర్యలు చేపడతామన్నారు. అందుకోసం రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. అలాగే స్కిల్ యూనివర్సిటీని విద్యా శాఖ పరిధిలోకి తీసుకు వస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. 202627 విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావతో కూడిన నాణ్యమైన అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం ఇకపై మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తారు. ••ష్ట్ర యువతకు విదేశాలలో సురక్షితమైన ఉపాధి, భాషా నైపుణ్యాలు, వీసా మార్గదర్శకత్వం అందించడానికి ఈ కొత్త ప్రోగ్రాం ప్రారంభిస్తారు. ఇంటర్మీడియట్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు 'రెట్రో ఫిటెడ్ మోటరైజ్డ్' వాహనాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు.

**కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా**

ప్రజల కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం తీసుకువస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ పథకం వల్ల రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకాన్ని జూన్ 2వ తేదీ నుంచి అమలు చేస్తామని ఆయన వివరించారు. 202627 వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ.3,24,234 కోట్ల అంచనాలతో రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రజల కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల మేర ఈ బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు.

# రెండేళ్లలోనే రికార్డు స్థాయిలో పెట్టుబడులు

- రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నాం
- నాలుగోసారి బడ్జెట్‌కు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు
- విమర్శలు కాదు.. సూచనలు చేయండి
- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతూ ప్రసంగించిన భట్టి





**హైదరాబాద్, మార్చి 20:**

ప్రజల ప్రయోజనాలే పరమావధిగా రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా సాగుతున్న ఈ ప్రజా ప్రభుత్వంలో నాలుగవసారి 202627 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ని ప్రవేశపెట్టే అవకాశం కల్పించిన తెలంగాణ ప్రజానీకానికి, ప్రభుత్వానికి, కాంగ్రెస్ నాయకత్వానికి ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భట్టి ప్రసంగం ఇలా సాగింది. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే పరిపాలన లక్ష్యమన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలతో తాము పాలన సాగిస్తున్నాం. తాము పాలకులం కాదు ప్రజలకు సేవకులం.. ప్రజలు తమకు అప్పగించిన ఈ అధికారాన్ని ఒక బాధ్యతగా భావించి ప్రజాసంక్షేమ, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకుపోతున్నాం.. రెండేళ్ల పాలనలో ప్రజలకు తామిచ్చిన వాగ్దానాలను సంతృప్తికరమైన స్థాయిలో నెరవేరుస్తూ వస్తున్నాం.. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక, వ్యవస్థల విధ్వంసాన్ని సరిచేస్తూ పాత అప్పులను, వాటి వడ్డీలను కట్టుకుంటూనే పాలనను గాడిలో పెట్టాం.. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాం.. అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలనదే తమ లక్ష్యం. ఈ రెండేళ్లలోనే రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులను తీసుకురాగలిగాం,. లక్ష్యాల వైపు అడుగు వేయడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా లెక్కచేయక ముందుకు సాగుతునాం.. ప్రజల నుండి పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును తిరిగి వారి అభ్యున్నతి కోసమే వెచ్చిస్తున్నాం.. ప్రతి పైసాకు తాము కాపాలాదారులుగా ఉంటున్నాం.. ఆదర్శవంతమైన పాలనలో రాష్ట్రాన్ని దేశానికి తలమానికంగా నిలబెడుతున్నాం.. పటిష్టమైన ప్రణాళిక, దూరదృష్టి, ప్రజలకు మేలు చేయాలనే పట్టుదల తమని నడిపిస్తున్నాయి. ప్రపంచ పరిస్థితులు ఏ విధంగా ఉన్నా తెలంగాణ ప్రజానీకం పట్ల వారి అభ్యున్నత పట్ల అత్యున్నతమైన చిత్తశుద్ధితో ఈ బడ్జెట్‌ను రూపకల్పన చేశాం.. బడ్జెట్ అంటే సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదు. ప్రజల చుటట్టూ తిరిగే సంఖ్యలు. బడ్జెట్ ప్రజల జీవన స్థితిగతుల మార్పునకు దోహదపడే లెక్కలు.. తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలు నిజం చేసే సంకల్ప పత్రమే ఈ బడ్జెట్. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అద్దం పట్టేలా దీన్ని రూపొందించాము. రాజ్యాంగ విలువలకు కట్టుబడి పారదర్శకతతో పాలన సాగిస్తున్నాం. గొప్పల కోసం అబద్ధాలు చెప్పం.. ఈ ప్రభుత్వం వాస్తవాల పునాదుల మీద పనిచేస్తున్నది.. స్టాన్‌ఫోర్డు యూనివర్సిటీల తరహాలో మన యూనివర్సిటీల్లో కూడా విద్యా ప్రమాణాలు పెంచాలని ప్రభుత్వం సంకల్పించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయాలను అంతర్జాతీయస్థాయి విద్యా సంసలుగాచ తీరిదిదేందుకు చర్యలు తీసుకుంటున్నాము. విద్య, ఉద్యోగావకాశాలు మెరుగుపరచడం, పెట్టుబడులను ఆకర్షించడంపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనపరిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్వయంగా జపాన్, సింగపూర్, దావోస్ పర్యటనలకు వెళ్ళి పారిశ్రామికవేత్తలతో సమావేశమై మెప్పించి, ఒప్పించడంవల్ల గత రెండేళ్లలో రూ.లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాము. 202526లో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (GSDP) ప్రస్తుత ధరల ప్రకారం రూ.17,82,198 కోట్లు. గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధి రేటు 10.7శాతంగా నమోదు అయ్యింది. ఇదే సమయంలో దేశ జీడీపీ రూ.357,13,886 కోట్లు కాగా, వృద్ధి రేటు 8 శాతంగా ఉంది. తెలంగాణ వృద్ధి రేటు దేశ సగటు వృద్ధి రేటు కంటే 2.7 శాతం ఎక్కువగా ఉంది. అదేవిధంగా దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్డీపీ 5.0శాతం వాటా కలిగి దేశానికి ఒక బలమైన 'గ్రోత్ ఇంజిన' గా నిలుస్తోంది. స్టేట్ న్యూట్రిషన్ మిషన్ ద్వారా పట్టణాల్లోని పేదలకు అదనపు పౌష్టికారాన్ని అందించడానికి ఏడాది కొత్తగా 20074 మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నాం. రూ.368 కోట్ల 27 లక్షల అంచనాతో ఎస్సీ కమ్యూనిటీ హాళ్ళు, అంబేద్కర్ భవనాలు/విగ్రహాలు లోయర్ ట్యాంక్ బండ్ వద్ద కొత్తగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జి టవర్, నింబోలి అడ్డా కాచిగూడలో బాబు జగ్జీవన్‌రామ్ పేరుతో నూతన వసతి గృహాన్ని నిర్మిస్తాం. గిరిజన గ్రామాల్లో ఆదివాసి సేవా కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు ఈ ఏడాది 50 వేల ప్రభుత సంసలకు టి ఫైబర్ ద్వారా సురక్షితమైన హైస్పీడ్ ఇంటర్నెట్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. యువతకు భవిష్యత్తుపై ఆశ కల్పించడం, ఆసరా కోసం చూసే బలహీనులను ఆదుకోవడం, నీడ లేని వారికి నీడ కల్పించడం, పంట పొలాలకు నీళ్లు పారించడం, ఫలసాయం పెంచడం, కష్టపడే వారికి పని కల్పించడం, ఇష్టపడేలా పాలన అందించడం, పేదవాడి కన్నీరు తుడిచిన నాడే నిజమైన అభివృద్ధి అన్న మహాత్మా గాంధీ మాటలను ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఈ రెండేళ్ల తమ పాలన, పదేళ్ల విధ్వంసాన్ని సరిదిద్దే పునాది ఈ బడ్జెట్. ఈ బడ్జెట్ ఒక సుందరమైన సుసంపన్నమైన ప్రశాంతమైన తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించే బ్లూ ప్రింట్ ప్రతిపక్షాలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా రాష్ట్ర అభివృద్ధికి నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇవ్వాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అందరినీ కోరుతునా౹.

## అంతర్జాతీయ ప్రమాణాలతో
# విపత్తుల శిక్షణ కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**



శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకుని కార్యాచరణ రూపొందించాలన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణల్ల విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్ఎఫ్, హైడ్రా, ఐసిసిసి విభాగాలతో మంత్రి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వహణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ, ఆర్థిక నష్టాలను కనిష్ఠ స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం, విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత పరిశోధన, పాలసీ సపోర్టు కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి కచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్, సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటివాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అడిషనల్ డిజీ సంజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



# సమగ్ర సంక్షేమ బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి**

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అనంతరం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. గ్రామీణాభివృద్ధికి వెన్నెముకగా నిలిచే పంచాయతీరాజ్ శాఖకు అత్యధిక కేటాయింపులు చేయడం ద్వారా గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం అయిందన్నారు. సామాజిక భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ రెండు లక్షల కొత్త పెన్షన్ల మంజూరు నిర్ణయం ఎంతో హర్షణీయమన్నారు. దీని ద్వారా వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలలు వంటి బలహీనవర్గాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఇది ఆర్థిక సహాయం మాత్రమే కాక వారి గౌరవప్రద జీవనానికి ప్రభుత్వం ఇస్తున్న హామీగా భావించాలన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు భద్రత కల్పించడం ఒక చరిత్రాత్మక నిర్ణయమని సీతక్క అన్నారు. ప్రమాదవశాత్తు కుటుంబంలో ప్రధాన ఆదారాన్ని కోల్పోయిన సందర్భాల్లో ఆ కుటుంబం ఆర్థికంగా కుదేలుకాకుండా ఉండేందుకు ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషిస్తోందని వివరించారు. ఈ పథకం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు భరోసా, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. విద్యారంగంపై కూడా ఈ బడ్జెట్ ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయడం ఎంతో గొప్ప నిర్ణయమని కొనియాడారు. ఇది విద్యార్థుల ఆరోగ్యం, హాజరు శాతం, చదువుపై దృష్టి పెంపునకు తోడ్పడుతుందని చెప్పారు. పేద కుటుంబాల విద్యార్థులు ఆకలితో పాఠశాలకు రావాల్సిన పరిస్థితి తొలగిపోతుందని, సమాన అవకాశాల దిశగా ఇది కీలక అడుగని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు.

# బిసిలను మోసం చేసిన బడ్జెట్

- **ఇచ్చిన హామీ మేరకు దక్కని కేటాయింపులు**
- **బీఆరఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**హైదరాబాద్, మార్చి 20:**

ప్రభుత్వం బీసీల గొంతు కోసిందని.. వారిని మోసం చేసిందని,ఇచ్చిన హామీ మేరకు కేటాయింపులు చేయలేదని బీఆరఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరోపించారు. తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై బీఆరఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీలకు కేటాయించాల్సిన రూ.20 వేల కోట్ల బడ్జెట్ ఎటు పోయిందని ప్రశ్నించారు. తులం బంగారం ఇస్తామని ఇవ్వకుండా చెవిలో పూలు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇచ్చిందని మంత్రి ప్రకటించారని.. ఇప్పుడేమో కేసీఆర్ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల బ్జడెట్‌లో కోతల విధించారని.. ఇంతలా కోతల విధించిన బ్జడెట్‌ను ఇప్పుడే చూస్తున్నానని విమర్శించారు. బీసీల ఆత్మగౌరవ భూములను లాగే ప్రయత్నాలు చేస్తున్నారని.. బీసీల చెవిలో పువ్వులు పెట్టి మోసం చేశారని ఆరోపించారు. త్వరలోనే బీసీల ఆగ్రహం చూస్తారని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు.

# ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**నారాయణపేట,మార్చి20:**

తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఇంటిని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ముట్టడించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే కోరుతూ పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు అక్కడికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొన్ని రోజులుగా ఆశా కార్యకర్తల సమస్యలపై పోరాటాలు చేస్తున్నా గాని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఆశా వర్కర్లకు రూ. 18 వేలు వేతనం వెంటనే అమలు చేయాలని, ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆశా వర్కర్లపై పెరుగుతున్న పనిభారం తగ్గించి, అదనపు భత్యాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం

- **ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు**
- **మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్**
- **పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది**
- **భట్టి కేటాయింపులపై హరీష్ రావు పెదవివిరుపు**

**హైదరాబాద్,మార్చి20(ఆరఎనఎం):**

తెలంగాణ బడ్జెట్‌పై బీఆరఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవి విరిచారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పించన్ పెంపు హామీలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమి లేదని హరీష్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి పేదలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్త హస్తమే మిగిల్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లు కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆరఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీష్‌రావు విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వ్లలెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గోరీ కట్టారని దెప్పిపొడిచారు. ఈ బ్జడెట్‌ను చూస్తే ఎన్నికల హామీలపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమైందని అన్నారు. గతం కంటే 20పేజీలు పెంచారు తప్ప.. హామీలకు కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. సీఎం ప్రజలకే కాదని.. ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 3లక్షల పింఛన్లు కట్ చేసి.. 2లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామంటున్నారని అన్నారు. కోటీశ్వరులు సంగతి అటుంచి.. మొదట మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్, ఇందిరమ్మ పేర్లతో అమలవుతోన్న స్కీంలకు సైతం కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ది.. అభయ హస్తం కాదని.. రిక్త హస్తమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మూడు ముక్కలాట తప్ప.. విజన్ లేదని దెప్పిపొడిచారు. బ్జడెట్‌లో అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహించారు. మూడున్నర లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. రేవంత్ చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆరఎస్ హయాంలో సచివాలయం, కాళేశ్వరం, చెక్ డ్యాంలు కట్టామని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోపెట్టుకుని భట్టి.. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహించారు. కాంగ్రెస్ హయాంలో స్కాంలు తప్ప.. స్కీంలు లేవని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో స్కాం జరిగిందని మంత్రి బిడ్డ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. గురుకుల పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేమో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటున్నారని దెప్పిపొడిచారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వానివి కట్టుకథలని విమర్శించారు. అక్రమ సంపాదన దాచుకోవటానికే ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మూడుసార్లు రైతుబంధు ఎగొట్టినందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలన గాడి తప్పటం వలనే



తలసరి ఆదాయం తగ్గిందని అన్నారు. పారిశ్రామికవేత్తలకు తుపాకులు పెట్టి మాముళ్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి యాదాద్రిని మూసేస్తామంటే.. భట్టి ఏమో యాదాద్రి తెలంగాణకు గర్వకారణమని అంటున్నారని అన్నారు. సింగరేణి గురించి కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కు లేదన్నారు. సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు... ప్రగల్భాలు

- **అప్పులకోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ**
- **బడ్జెట్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**

**హైదరాబాద్,మార్చి 20:**

అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప బడ్జెట్‌లో ఒరిగిందేమి లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బ్జడెట్ ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ తీవ్రంగా విమర్శించారు. 'మోసం.. దగా.. ప్రజా వంచన బ్జడెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు.మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గుచేటని అన్నారు. రాష్టాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమి చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బ్జడెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బ్జడెట్ ఇదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదించినా 8 శాతానికే పరిమితం చేశారని బండి సంజయ్ విమర్శించారు. దేవాదాయ శాఖకు గత బ్జడెట్‌లో రూ.190 కోట్లు కేటాయించినా ఈసారి ప్రస్తావనే లేదని అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బ్జడెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని.. ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆరఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# చెవిలో పూలు పెట్టిన భట్టి బడ్జెట్

- **అన్ని వర్గాలను విస్మరించిన కేటాయింపులు**
- **బిఆరఎస్ ఎమ్మెల్యేల చెవిలో పూలతో విమర్శలు**

**హైదరాబాద్,మార్చి20**

బడ్జెట్ మొత్తం మోసమని, అన్ని వర్గాల ప్రజల చెవిలో కాంగ్రెస్ ప్రభుత్వం పువ్వులు పెట్టిందని మాజీ మంత్రి, బీఆరఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్ మొత్తంలో ఎక్కడ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే అంశమే లేదన్నారు. ఆరు గ్యారంటీల ఊసే తీయలేదని మండిపడ్డారు. కేవలం కుంభకోణాల కోసమే కాంగ్రెస్ సర్కారోళ్లు ఈ బడ్జెట్ పెట్టుకున్నరని ఆరోపించారు. ఈ మేరకు గంగుల కమలాకర్, వివేకానందలో కలసి చెవిలో పూలతో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై బ్జడెట్‌లో ఎలాంటి అంశం లేదని విమర్శించారు. రైతు భరోసాను ఇచ్చిన మాట ప్రకారం ఈ సారైనా ఎకరానికి రూ.15 వేలకు పెంచుతారని ఆశించామని, కానీ ఊసే తీయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆఖరికి ఆ రూ.12 వేల చొప్పున కూడా ఎప్పుడు ఇస్తారో చెప్పలేదని ధ్వజమెత్తారు. రైతులకు ఏడాదికి రూ.12 వేల అంశం కూడా ఉత్తమాటగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఇక మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డితోసహా కాంగ్రెస్ నేతలు జోరుగా ప్రచారం చేశారని, కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఆ హామీని నెరవేర్చలేదని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది ఆడబిడ్డలను దగా చేయడమేనని మండిపడ్డారు. వృద్ధ్యాప్య పించన్‌లు, వికలాంగ పించన్‌ల విషయంలో కూడా ప్రభుత్వం మాటతప్పిందని విమర్శించారు.

## బడ్జెట్ ప్రతులను చించేసిన బిఆరఎస్

- **ఆరు గ్యారెంటీలపై సభలో నినాదాలు**
- **బడ్జెట్ బహిష్కరిస్తూ వాకౌట్**

**హైదరాబాద్,మార్చి20:**

తెలంగాణ అసెంబ్లీలో ఇవాళ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా మోసమని ప్రతిపక్ష బీఆరఎస్ పార్టీ మండిపడింది. బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రతిపక్ష బీఆరఎస్ సభ్యులు ప్రతులను చింపిపారేశారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేశారు. దాంతో అసెంబ్లీలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026`27 వార్షిక బ్జడెట్‌కు నిరసనగా ప్రధాన ప్రతిపక్షం బీఆరఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బ్జడెట్ ప్రసంగం ప్రారంభించగానే.. బీఆరఎస్ సభ్యులు వినూత్న రీతిలో తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలను 'చెవిలో పూలు' పెట్టి మోసం చేస్తోందంటూ.. బీఆరఎస్ ఎమ్మెల్యేలు తమ చెవుల్లో పూలు పెట్టుకుని సభ నుంచి బయటికి వచ్చారు. ముందుగా బ్జడెట్ ప్రసంగం మొదలవగానే.. ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపిస్తూ బీఆరఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ముఖ్యంగా 'ఆరు గ్యారంటీల' అమలు తీరుపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం సభ నుంచి బయటికి వచ్చిన బీఆరఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ఎంట్రీ వద్దకు చేరుకుని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 'తులం బంగారం మోసం మోసం' అని నినాదాలు చేస్తూ ప్రభుత్వం పేద మహిళలను వంచించిందని విమర్శించారు. 'రెండు లక్షల ఉద్యోగాలు మోసం మోసం' అని నినదిస్తూ యువతకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవడం లో విఫలమైందని మండిపడ్డారు.

# ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో, ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పుకోవడానికి ఒక్క రిజల్ట్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా విద్యా రంగానికి ఈ బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి గత ఏడాది కంటే రూ.1000 కోట్లు పెంచినట్లు చూపిస్తున్నా ఓవరాల్ బడ్జెట్‌లో దీని వాటా 8 శాతం మాత్రమేనని గుర్తు చేశారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (13%), బీహార్ (21%) తమ బడ్జెట్‌లో విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతలో సగం కూడా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలు అని గొప్పలు చెప్పడం తప్ప విద్యా వ్యవస్థను మెరుగుపరిచే ఒక్క ప్రయత్నం కూడా కనిపించడం లేదన్నారు. ఆరోగ్య రంగం విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగున ఉందని నిలదీశారు. ఆరోగ్యశ్రీ బకాయిలే ఇంకా చెల్లించలేని రేవంత్ ప్రభుత్వం పెన్షన్లు, ఇతర బెనిఫిట్లను కూడా ఆరోగ్యశ్రీ డిపార్ట్‌మెంట్‌కే అప్పగించడం అంటే ఆ సంస్థను కూడా దివాలా తీయించడమేనని విమర్శించారు. అభివృద్ధి ఎక్కడ జరుగుతుందో చెప్పకుండా 'ఫ్యూచర్ సిటీ' అని ఫ్యాన్సీ పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన ఘనతగా చెప్పుకుంటున్న ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అన్నీ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇచ్చే పథకాలతోపాటు, 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' పథకాల వల్ల వచ్చినవేనని స్పష్టం చేశారు. రీజనల్ రింగ్ రోడ్ (ఆరఆరఆర్), దాని పక్కన వచ్చే రీజనల్ రింగ్ రైల్ కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఫండింగ్ అని, కేవలం భూసేకరణ తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని ఎండగట్టారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీనరేగా) స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వికసిత్ భారత్ రోజ్‌గార్ అజీవికా మిషన్ (గ్రామీణ) ((VBG RAMJI) చట్టం ద్వారా లబ్ధిదారులకు నేరుగా రూపాయికి రూపాయి అందుతుందని వెల్లడించారు. గతంలో కాంగ్రెస్ ప్రధాని రాజీవ్ గాంధీ స్వయంగా కేంద్రం రూపాయి పంపిస్తే లబ్ధిదారులకు చేరేసరికి 15 పైసలు మాత్రమే మిగులుతున్నాయని అన్నారని గుర్తు చేస్తూ నేడు నరేంద్ర మోదీ పాలనలో ఆ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పంపే ప్రతి పైసా నేరుగా పేదవాడి ఖాతాకే చేరుతోందన్నారు. రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు ఆడుతోందని రామచందర్ రావు మండిపడ్డారు. ఐదు దఫాలుగా రైతు భరోసా ఇవ్వాల్సి ఉండగా, సరిగ్గా ఇవ్వకుండా.. ఇంకా ప్రతి రైతుకు ఇంకా సుమారు ఎకరాకు రూ.45, 000కి పైగా బాకీపడి ఎగ్గొట్టారని విమర్శించారు. రూ.4000 నిరుద్యోగ భృతి కానీ, మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఆర్థిక సాయం గురించి



కానీ ఈ బడ్జెట్‌లో ఎక్కడా లేదన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి ఈ బడ్జెట్‌లో చోటులేకపోవడం ప్రజలను వంచించడమేనన్నారు. కాంగ్రెస్ సర్కారు మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్ట్ వ్యయం రెండు రోజుల్లోనే రూ. 5000 కోట్ల నుండి రూ.7000 కోట్లకు ఎలా పెరిగిందని నిలదీశారు. ఇదంతా ఒక ప్లానింగ్ లేని విధానమని, కేవలం దోచుకోవడానికేనని ఆరోపించారు. దేవాలయాల విషయంలో కూడా ప్రభుత్వం వివక్ష చూపుతోందని రామచందర్ రావు విమర్శించారు. అర్చకుల వేతనాలు పెంచాలని, ధూపదీప నైవేద్యాలకు బడ్జెట్ పెంచాలన్న డిమాండ్లను పట్టించుకోకుండా కేవలం మైనారిటీ బడ్జెట్‌ను రూ.700 కోట్లు పెంచడం ఓటు బ్యాంక్ పాలిటిక్స్‌లో భాగమేనన్నారు. హైదరాబాద్ నగరాన్ని మూడు ముక్కలు చేసి జీహెచఎంసీకి బడ్జెట్ కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఓవరాల్‌గా ఈ బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, పేదలకు దూరంగా ఉన్న ఈ ఫెయిల్డ్ బడ్జెట్‌ను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు.



## సంపాదకీయం

# అభిశంసనతో సాధించేదేమిటి?

సర్ ప్రక్రియలతో అనేక రాష్ట్రాల్లో లక్షల ఓట్లు తొలగించారు. అయితే తొలగించిన ఓట్లకు సంబంధించి ఎక్కడా పెద్దగా ఫిర్యాదులు అందలేదు. దీంతో ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా పార్టీలు తిరిగి అధికారం పొందుతాయా అన్న సందేహంలో ఉన్నాయి. ప్రధానంగా బెంగాల్లో మమతా బెనర్జీకి అధికార భయం పట్టుకుంది. సర్‌తో బెంగాల్లో 60 లక్షలకు పైగా ఓట్లు తొలగించారని తెలుస్తోంది. సర్ ప్రక్రియ ముగిసిన తరవాత వివిధ రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దఫాల్లోనూ, మిగిలిన చోట్ల ఏప్రిల్ 9న ఒకే దఫాతో ఎన్నికలు ముగుస్తాయి. ఐదు అసెంబ్లీల పరిధిలో 824 స్థానాలకు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎస్ఐఆర్ పక్రియతో సుమారు కోటీ 40 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. అయితే ఏ రాష్ట్రంలోనూ ప ఎద్దగా వ్యతిరేకత రాలేదు. వ్యతిరేకత కేవలం మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారి నుంచి వచ్చాయి. తాము ఓట్లు కోల్పోయామని పదుల సంఖ్యలో కూడా ఎవ్వరూ ముందుకు రాకపోవడం గమనించాలి. అయితే ఓటు నమోదులో ఇప్పటికీ శాస్త్రీయ పద్దతిని అవలంబించడం లేదు. పక్కాగా ఓటరు కార్డు దక్కడం లేదు. ఓటు నమోదు మొదలు, ఓటు తొలగింపు వరకు అంతా గందరగోళంగా సాగుతోంది. ఈ క్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఎన్నికల కమిషన్ ఓ రాజ్యాంగ ప్రతిపత్తి గలిగిన సంస్థ. దాని పని అది చేసుకుంటూ పోతున్నది. ఎవరు అధికారంలో ఉన్నా, ఎన్నికల కమిషన్ పనిచేస్తూనే ఉంది. కానీ విపక్ష కాంగ్రెస్, తదితర పార్టీలకు ఇది మింగుడు పడడం లేదు. అందుకు జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన నోటీసులు ఇచ్చారు. ఇది కేవలం రాజ్యాంగ సంస్థ నిజాయితీని నిలదీయడం తప్ప మరోటి కాదు. ఇప్పటికే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ తదితర పక్షాలు తలబొప్పి కట్టించుకున్నాయి. ఇకపోతే రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 17.4 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల పరిశీలన సర్ పేరుతో తొలగించండతో తట్టుకోలేక పోతున్న ఓట్లను ప్రతిపక్షాలు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను నిలదీసే లక్ష్యంతో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లో పక్కనే ఉన్న బంగ్లా జాతీయు ఓట్లను తొలగించే ప్రక్రియ జరగింది. అక్రమంగా ఇక్కడ తిష్టవేసి ఓటర్లుగా మారారు. వారే రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉండాలో నిర్ణయించే దశకు చేరుకున్నారు. మరో వైపు ఒక్క చట్టబద్ధమైన ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా చూశామని సిఇసి జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. ఒక్క అనర్హుడు కూడా ఓటు వేసే అవకాశం లేకుండా చూడటమే తన లక్ష్యమని చెప్పారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రోజుకు లక్ష వరకూ ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాయి. నోటిఫికేషన్ రాగానే బెంగాల్ సిఎస్, డిజిపి, హోం శాఖ కార్యదర్శి, కొల్‌కతా సిపిలను ఇసి బదిలీ చేయడం ద్వారా మమతకు వత్తాసుగా ఉన్న వారిని తొలగించింది. పశ్చిమ బెంగాల్‌లో పగ్గాలు చేజిక్కించుకోవాలని, కేరళం, తమిళనాడులోనూ అధికారం నిలబెట్టుకునేందుకు ఆయా పార్టీలు చేస్తున్న ప్రయత్నాలకు నిజంగానే సర్ విఘాతం కలిగించి ఉంటుంది. ఓ వైపు మత విద్వేషాలు, హింసను రెచ్చగొట్టడం ద్వారా కుల, మత విభజనను తీసుకురావడం ద్వారా మరోమారు అధికారంలో కొనసాగాలని మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారు ఎత్తులు వేస్తున్నారు. అందుకే మమతా బెనర్జీ ఏకంగా 50శాతం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించింది. తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని ప్రభుత్వం రెండోసారి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రజాతీర్పును కోరుతోంది. పదేళ్ల పాలనలో అభివృద్ధి చెందిన దేశాల జీవన ప్రమాణాలతో పోటీ పడేలా కేరళంను తీర్చిదిద్ది, తీవ్ర పేదరికాన్ని తరిమేసి, ఎన్నో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ చెప్పుకుంటోంది. ప్రజానుకూల పాలనకు, ప్రజలపై ఉన్న నమ్మకానికి ప్రతీకగా మరోమారు విజయం సాధిస్తామని చెబుతోంది. అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య యుతంగా జరగాలని కోరుకుంటున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. అయితే జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసిండం అంత సులువు కాదు. అధికార ఎన్‌డిఎ పూర్తి మద్దతుతో ఉండడంతో ఈ ప్రయత్నం ఎరవేరక పోవచ్చు. అలాగే సర్ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా బీహార్‌లో కాంగ్రెస్ తలబొప్పి కట్టించుకుంది. మమతా బెనర్జీ కూడా సుప్రీంతో చివాట్లు తింది. ఇవన్నీ మరచి వీరు చేస్ఏ ప్రయత్నాలతో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే పని తప్ప మరోటి కాదని గుర్తించాలి. అలాగే అధికారంలో ఉంటూ మమతా బెనర్జీ లాంటి వారు రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడడం క్షమించరాని నేరంగా పరిగణించాలి.



# హర్మూజ్ జలసంధిపై 'అమెరికా' సమరభేరి

- ఇరాన్ క్షిపణి లక్ష్యాలపై విరుచుకుపడుతున్న అపాచీలు
- అండగా యూరోపియన్ దేశాలు..
- చమురు సరఫరా పునరుద్ధరణే లక్ష్యంగా భారీ ఆపరేషన్




**వాషింగ్టన్/లండన్, మార్చి 20 :** ప్రపంచ చమురు రవాణాకు జీవనాడి వంటి హర్మూజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు అమెరికా తన సైనిక శక్తిని రంగంలోకి దించింది. ఇరాన్ మోహరించిన క్షిపణులు, డ్రోన్లు మరియు ఫాస్ట్ అటాక్ బోట్లను ఎదుర్కొనేందుకు 'ఆపరేషన్ హర్మూజ్ విముక్తి'ని వేగవంతం చేసింది. ఈ కీలక పోరులో అమెరికాకు మద్దతుగా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ సహా పలు ఐరోపా దేశాలు, జపాన్, కెనడాలు సంయుక్త ప్రకటన విడుదల చేయడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తీర ప్రాంతంలో ఇరాన్ ఏర్పాటు చేసిన క్షిపణి లాంచర్లు, డ్రోన్లను ఛేదించేందుకు అమెరికా అత్యంత శక్తివంతమైన అపాచీ అటాక్ హెలికాప్టర్లను, తక్కువ ఎత్తులో ఎగిరే ఏ-10 (ూా-10) యుద్ధ విమానాలను రంగంలోకి దించినట్లు అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ వెల్లడించారు. ఇప్పటికే ఈ దాడుల్లో దాదాపు 120 శత్రు నౌకలను ధ్వంసం చేసినట్లు రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ధృవీకరించారు. ఇరాన్ పరిచిన మైన్లు, ఉచ్చులను పూర్తిగా తొలగించేందుకు మరో వారం రోజుల సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు 2,200 మంది అమెరికా మెరైన్ కమాండోలు ఇప్పటికే ఇరాన్ దక్షిణ తీరంలోని వ్యూహాత్మక ద్వీపాలను స్వాధీనం చేసుకునే దిశగా కదులుతున్నారు.

### మద్దతుగా నిలిచిన మిత్రదేశాలు

గల్ఫ్ రీజియన్‌లో వాణిజ్య నౌకలపై ఇరాన్ జరుపుతున్న దాడులను బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్ మరియు కెనడాలు తీవ్రంగా ఖండించాయి. హర్మూజ్ జలసంధిని మూసివేయడం అంతర్జాతీయ వాణిజ్యానికి గొడ్డలి పెట్టు అని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 2817కు ఇరాన్ కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశాయి. జలసంధి ద్వారా సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి అమెరికాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ దేశాలు ప్రకటించాయి.

### చమురు మార్కెట్ల స్థిరీకరణకు చర్యలు

హర్మూజ్ జలసంధి మూసివేత ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు బ్యారెల్‌కు 119 డాలర్లను తాకాయి. ఈ నేపథ్యంలో ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను విడుదల చేయాలని అంతర్జాతీయ ఇంధన సంస్థ (×జూా) నిర్ణయించింది. చమురు ఉత్పత్తిని పెంచేందుకు ఇతర ఉత్పాదక దేశాలతో కలిసి పనిచేస్తామని మిత్రదేశాల కూటమి స్పష్టం చేసింది. ప్రస్తుత సైనిక చర్యలతో త్వరలోనే హర్మూజ్ మార్గం సాధారణ స్థితికి వస్తుందని అమెరికా ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# మరోమారు పెరిగిన బంగారం ధరలు

- పదిగ్రాముల బంగారంపై 650 పెరుగుదల
- లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు



**న్యూఢిల్లీ, మార్చి 20:** మధ్య ప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం భారీగా పతనమైన బంగారం ధర శుక్రవారం స్వల్పంగా కోలుకుంది. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ.650ల మేర పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.600ల మేర పెరిగింది. వెండి ధర మాత్రం తిరోగమనంలో కొనసాగుతూ మరో రూ.5 వేల మేర తగ్గింది (ఉనీటె, ఞాతిలెెస ఖసతిఇ।బ నీని ఓజీసఇఠ 20). గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,930కు పెరిగింది. నిన్నటితో పోలిస్తే ధర రూ.650ల మేర ఎగబాకింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర కూడా రూ.600ల మేర పెరిగి రూ.1,38,350కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం దాదాపుగా నిన్నటి స్థాయిలోనే కొనసాగుతోంది. కిలో వెండి ప్రస్తుతం రూ.2,64,900గా ఉంది. ఇతర ప్రధాన నగరాల వారీగా చూస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,630గా ఉంది. ఢిల్లీలో రూ.1,51,080గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,50,930గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ బంగారం ధర రూ.1,38,990గా ఢిల్లీలో రూ.1,38,500 వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,38,350గా ఉంది. దేశంలోని పలు నగరాల్లో వెండి ధరలు తగ్గాయి. కిలో వెండి చెన్నైలో రూ.2,64,900గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో కిలో వెండి రూ.2,55,000 వద్ద కొనసాగుతోంది. ఇకపోతే మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం అద్భుతమైన రికవరీని సాధించాయి. ఆరంభంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతుతో ఒక దశలో సెన్సెక్స్ 900 పాయింట్లు, నిఫ్టీ 23,300 పాయింట్ల మార్కును దాటి దూసుకుపోయాయి. గత కొన్ని రోజులుగా పడుతున్న మార్కెట్లలో షేర్లు తక్కువ ధరకే లభిస్తుండటంతో దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఆఎఐఐ), రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లు చేపట్టారు. మరోవైపు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై సానుకూల సంకేతాలు ఇవ్వడం ప్రపంచ మార్కెట్లకు బలాన్ని ఇచ్చింది. ఇది భారత మార్కెట్లలో కూడా ఉత్సాహాన్ని నింపింది. ఈ రోజు ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఐటీ, ఆటోమొబైల్ రంగాలు అగ్రగామిగా నిలిచాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ వంటి బ్లూ-చిప్ షేర్లు మార్కెట్‌ను ముందుకు నడిపిస్తున్నాయి.

# ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు

- ఎరువుల సరఫరాను నిలివిపేయనున్న చైనా
- భారత్ తదితర దేశాలకు రవాణ ఆపే చర్యలు
- పలుదేశాల వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం



**న్యూఢిల్లీ, మార్చి 20:** ముడి చమురు సరఫరాలో అవాంతరాలతో ఇక్కట్ల పాలవుతున్న ప్రపంచదేశాలకు కొత్త సమస్య వచ్చి పడేటట్టు ఉందన్న భయాలు నెలకొన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. ఎరువుల ఎగుమతుల్లో ప్రపంచంలో నెం.2గా ఉన్న చైనా వీటి ఎగుమతులపై ఆంక్షలకు సిద్ధమైంది. ఎగుమతుల్లో కోత పెట్టాలని చైనా ఆర్థిక ప్రణాళిక సంస్థ ఎన్‌డీఆర్‌సీ దేశీయ సంస్థలకు సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో జెట్ ఫ్యుయెల్, డీజిల్, కిరోసిన్‌ల ఎగుమతులను తగ్గించాలని నెలలో ఎన్‌డీఆర్‌సీ సూచించింది. దేశీయ ఇంధన, ఆహార అవసరాల కోసం చైనా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. చైనా ఎరువులు ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో పాటు భారత్‌కూ ఎగుమతి అవుతుంటాయి. కొన్ని దేశాలకు ఎగుమతులను నిలిపివేయాలని తమకు ఆదేశాలు అందాయని షాండాంగ్ ప్రావిన్స్‌లోని ఒక ఫర్టిలైజర్ సం స్థ అధికారి పేర్కొన్నారు. అయితే, ఈ ఆంక్షల విషయమై చైనా ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఎగుమతులకు బ్రేకులు తప్పవని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి. దేశీయ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చైనా అన్ని చర్యలు తీసుకుంటుందని అంటున్నాయి. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ డేటా ప్రకారం, ఎరువుల ఎగుమతుల్లో రష్యా నెం.1 కాగా రెండో స్థా నంలో చైనా ఉంది. జెట్ ఫ్యుయెల్ ఎగుమతి చేసే దేశా ల్లో చైనా ఆరవ స్థానంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం.. జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్‌ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోవడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత దేశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీ సరఫరా లేకపోవడంతో భారత్‌లోని పలు యూరియా కంపెనీలు ఎ÷-లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి.

# డాలర్‌తో రూపాయి మారకం 93.15కు చేరిక




**న్యూఢిల్లీ, మార్చి 20:** మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ శుక్రవారం ట్రేడింగ్ ఆరంభంలో రికార్డు స్థాయిలో పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తొలిసారిగా 93.15 వద్దకు చేరింది. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చడం రూపాయి మారకం విలువపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఇక బ్రెంట్ క్రూడ్ ధర ప్రస్తుతం బ్యారెల్ 100 డాలర్లకు పైనే కొనసాగుతోంది. ముడి చమురు సరఫరాలో అంతరాయాలు సుదీర్ఘకాలంపాటు కొనసాగుతాయన్న భయాలు బ్రెంట్ క్రూడ్ ధరలు పైకి ఎగబాకేలా చేస్తున్నాయి. చమురు ధరలు పెరిగే కొద్దీ డాలర్‌కు డిమాండ్‌కు పెరిగి రూపాయి విలువపై ప్రతికూల ప్రభావం పడుతోందని నిపుణులు చెబుతున్నారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు స్టాక్ మార్కెట్‌పైనా తీవ్ర ప్రభావం చూపించాయి. గురువారం గ్లోబల్ మార్కెట్స్‌లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడటంతో సూచీలు కుప్పకూలాయి. డాలర్‌పై పెట్టుబడులు పెరగడంతో అమెరికన్ కరెన్సీ మరింత బలపడింది. ఫలితంగా రూపాయి సహా అనేక వర్ధమాన దేశాల కరెన్సీలపై ప్రతికూల ప్రభావం పడిందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. వ్యవస్థాగత మదుపర్లు కూడా భారత్ నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో రూపాయి విలువపై ఒత్తిడి మరింత పెరిగింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్యపరపతి విధానం కూడా ఈ పరిస్థితికి కొంత దోహదపడిందని నిపుణులు చెబుతున్నారు. ద్రవ్యోల్బణం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో యూఎస్ ఫెడ్ వడ్డీ రేటులో కోత పెట్టేందుకు సంకోచిస్తోంది. దీంతో, పెట్టుబడిదారులకు డాలర్ మరింత ఆకర్షణీయంగా మారి వర్ధమాన మార్కెట్స్ నుంచి నిధులు తరలి పోతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

# పంట నష్టం అంచనాలు రెండ్రోజుల్లో తేల్చాలి

**ఎల్పీజీ సరఫరాకు అంతరాయం కలగద్దు**

**అంతర్జాతీయ పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలి**

**సీఎం చంద్రబాబు ఆదేశం**



**అమరావతి, మార్చి 20 :** రాష్ట్రంలో అకాల వర్షాలు, వడగళ్ల వానల వల్ల సంభవించిన పంట నష్టంపై రెండు రోజుల్లోగా పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టంపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లోని 42 మండలాల్లో భారీగా పంట నష్టం వాటిల్లిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సుమారు 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలు దెబ్బతిన్నాయని, వీటి విలువ రూ. 40 కోట్లుగా ప్రాథమికంగా లెక్కగట్టారు. అలాగే 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలు (అరటి, బొప్పాయి, మిరప, మామిడి, నిమ్మ తదితర) దెబ్బతినగా, వాటి నష్టం రూ. 23 కోట్లుగా తేల్చారు. అన్ని పంటలు కలిపి మొత్తం నష్టం రూ. 63 కోట్లుగా అధికారులు అంచనా వేశారు.

**గ్లోబల్ సప్లయ్ చైన్ సంక్షోభంపై నిఘా**

మరోవైపు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎల్పీజీ సరఫరాపై ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్ష చేపట్టారు. ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగితే గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం ఉందని, దీనివల్ల గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆలయాలు, అన్న క్యాంటీన్లు మరియు అంగన్‌వాడీలకు గ్యాస్ డెలివరీలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

**ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి**

గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని అధికారులను కోరారు. ఎరువులు, పెట్రోల్, డీజిల్ నిల్వల విషయంలో ఎటువంటి కొరత రాకుండా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సీఎం స్పష్టం చేశారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# అకాల వర్షంతో అన్నదాతల కుదేలు

**దెబ్బతిన్న పలు రకాల పంటలు**

**భారీగా నష్టపోయామని ఆందోళన**

**ఆదుకుంటామన్న మంత్రి అచ్చన్నాయుడు**


**అమరావతి, మార్చి 20:** అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ సాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. అకాల వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే 3-4 రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతుల్ని అప్రమత్తం చేయాలని అచ్చెన్నాడు చెప్పారు. దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని అన్నారు. అధికారులు నష్టం వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. ఇకపోతే వరుసగా రెండో రోజూ అకాల వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని అన్నదాతలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిశాయి.

గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, జి.మాడుగులలో వడగళ్లు పడ్డాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గురువారం కురిసిన మోస్తరు వర్షాలకు మొక్కజొన్న, మినుము, పెసర పంటలు మళ్లీ తడిచాయి. తడిచిన కారణంగా కాయలు రాలిపోతాయని, మినుము రంగుమారిపోతుందని, గింజలు రంగు మారిపోతాయని, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. లంక భూముల్లో కోత అనంతరం ఆరబెటట్టిన మిర్చిపంట, ఉడకబెట్టి ఆరబోసిన పసుపు తడిచిపోయాయి. నెల్లూరు జిల్లాలో బుధ, గురువారాల్లో రాత్రిపూట కురిసిన వర్షాలకు కోతకు వచ్చిన వరి పైరు దెబ్బతినగా, మామిడి పూత, పిందెలు నేలరాలాయి. రాపూరు మండలం గోనుపల్లిలో వడగండ్ల వానకు దాదాపు 100 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. రాంకూరు, గరిమెనపెంట గ్రామాల్లోని 100 ఎకరాల్లో మామిడి తోటల్లోని పూత, పిందె నేలరాలింది. నిమ్మ తోటల్లో పండ్లు రాలిపోయాయి. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, లింగంగుంట, మంగుపలి,?ల కామిరెడ్డిపాడు, అనంతసాగరం గ్రామాల్లో వరి దెబ్బతినగా, గుడిగుంట, గౌరవరం, గుడిగుంట గ్రామాల్లో మిరప, బొప్పాయి, పత్తి మెట్ట పైర్లు దెబ్బతిన్నాయి. కొండాపురం, జలదంకి మండలాల్లో వరి కోతలు పూర్తి చేసిన రైతులు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం రాశులను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లాలో రైతులకు రూ.1.29 కోట్ల పంటనష్టం వాటిల్లినట్టు అంచనావేశారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రోనిపల్లిలో వడగండ్ల వానకు కర్బూజ పంట ధ్వంసమైంది. తిరుపతి జిల్లాలో 1070 ఎకరాల్లో అరటి, వరి, తమలపాకు పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు సుమారు రూ.10.25 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో గురువారం జల్లులు కురవడంతో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిని కాపాడుకోడానికి రైతులు శ్రమించాల్సి వచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం వడగళ్లు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పూత, పిందె దశలో ఉన్న మామిడి పంటకు నష్టం వాటిల్లింది. కాపు దశలో ఉన్న జీడిమామిడి సైతందెబ్బతిందని రైతులు చెబుతున్నారు. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో వర్షాలు పడతాయని, గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 23 వరకు కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాష్ట్రంలో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం కోస్తాలో శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకు అక్కడక్కడ పిడుగులతో పాటు మోస్తరు వర్షాలు, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయని పేర్కొంది.

# ఎల్పీజిని అందుబాటులో ఉంచాలి

**అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మడానికి వీల్లేదు**

**ఎపి హైకోర్టు కీలక ఆదేశాలు**



**అమరావతి, మార్చి 20:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా వంట గ్యాస్ కొరత ఏర్పడిన నేపథ్యంలో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చమురు శుద్ధి సంస్థలు ఎల్పీజీని అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. దేశంలో ఎల్పీజీ కొరత ఉన్న సమయంలో చమురు శుద్ధి సంస్థలు అంతర్జాతీయ మార్కెట్లో విక్రయాలకు పాల్పడితే.. అది సామాన్య ప్రజలకు తీరని నష్టంతో పాటు కష్టాలను కలిగిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరా చేసేందుకు వీలుగా గ్యాస్ను పంపిణీదారులకు మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించింది. దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు ప్రొపేన్, బ్యూటేన్ నిల్వలను గరిష్ఠంగా ఎల్పీజీ ఉత్పత్తి కోసం ఉపయోగించడంతో పాటు ఉత్పత్తి చేసిన ఎల్పీజీని ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీఎల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్లకు అందుబాటులో ఉంచి.. దానిని కేవలం దేశీయ వినియోగదారులకు మాత్రమే సరఫరా చేయాలంటూ ఈ నెల 5న జారీ చేసిన స్వీయ ఉత్తర్వుల కఠిన అమలుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ, కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్లను ఆదేశించింది. ఇందులో భాగంగా వారికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.

# గ్యాస్ కొరత లేదు

మొదటి పేజీ తరువాయి

ఎక్కడా కొరత లేదని మంత్రి తెలిపారు. గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని ఆయిల్ కంపెనీలు కూడా తెలియజేశాయని చెప్పారు. అయితే గ్యాస్‌ను పక్కదారి పట్టించడం, అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించా ల్సిందిగా సూచించారు. జిల్లాల్లో గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద బుకింగ్స్, డెలివరీలు, పెండింగ్ అంశాలను నిరంతరం సమీక్షించాలని జాయింట్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనుమానాస్పద లావాదేవీలు లేదా సరఫరాలో అక్రమాలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మంత్రి మాట్లాడుతూ.. గ్యాస్ కొరతపై ప్రభుత్వం పూర్తిగా దృష్టి సారించిందన్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నామని చెప్పారు. ఈ నెల 21న రావాల్సిన గ్యాస్ నౌక 25న చేరుతుందని కేంద్రం సమాచారం ఇచ్చిందని వెల్లడించారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరమైనంత మేరకే గ్యాస్ బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికంగా బుకింగ్స్ చేస్తే ఇతరులకు ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు. గ్యాస్ బుకింగ్స్ ఆన్‌లైన్ ద్వారానే చేయాలని, ఓటీపీ వచ్చిన తర్వాతే బుకింగ్ ఖరారవుతుందని తెలిపారు. బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే మీడియా కథనాల ఆధారంగా నిఘా పెంచినట్లు చెప్పారు. గృహ అవసరాల గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు మళ్లించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అదేవిధంగా, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అర్బన్ ప్రాంతాల్లో పైప్డ్ గ్యాస్ విధానంపై పని జరుగుతోందని వెల్లడించారు. హోటల్స్, రెస్టారెంట్ల ప్రతినిధులతో త్వరలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా పాఠశాల హాస్టల్స్, ఆసుపత్రులకు గ్యాస్ సరఫరా ప్రాధాన్యను బట్టి ఇస్తామని చెప్పారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం కిరోసిన్ సరఫరాను కూడా అనుమతించిందని, అవసరమైతే రాష్ట్రంలో మళ్లీ వినియోగంలోకి తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు.

# పాల ఉత్పత్తి దారులు నమోదు తప్పనిసరి

**పశుసంవర్ధక శాఖ సంచాలకులు దామోదర్ నాయుడు..**



**విజయవాడ, మార్చి 20 :** పాల సహకార సంఘాలలో సభ్యులు కాని పాల ఉత్పత్తి మరియు విక్రయదారులు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఎఫ్ఎస్ఎస్ఎఐలో నమోదు చేసుకోవలెనని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు పాల విక్రయదారులకు సూచించారు. సహకార సంఘాల్లో సభ్యులుకాని పాల ఉత్పత్తి మరియు విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు పొందిన పిమ్మట మాత్రమే తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో పాల కల్తీకి సంబందించిన ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పాల ఉత్పత్తి మరియు విక్రయదారుల నమోదు / లైసెన్సింగ్ నియమావళిని తప్పనిసరిగా అనుసరించాలని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా పశుసంవర్ధక శాఖాధికారులు తమ నిర్దేశిరచబడిన అధికార బృందాలచే కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి పాల ఉత్పత్తి మరియు విక్రయదారులు ఈఃూంఎ లో సంబంధిత నమోదు / లైసెన్స్ కలిగి ఉన్నారా? లేదా? అని నిర్దేశిరచడం జరుగుతుందని చెప్పారు. ఃూల ఉత్పత్తి మరియు విక్రయదారుల పాలు ఇతర ఉత్పత్తుల నిర్వహణ సురక్షితమైన మరియు నాణ్యమైన విధానంలో జరుగుతోందని పశుసంవర్ధక శాఖ అధికారులు ధ్రువీకరించడం జరుగుతుందన్నారు. నిబంధనలు పాటించని సందర్భంలో తగిన చర్యలు అనేవి తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పాలు, ఉప ఉత్పత్తుల వినియోగదారులు అందరూ ఈ విషయంలో తగిన అవగాహనతో ఉండాలని తెలిపారు. ఏదైనా పాల ఉత్పత్తి, విక్రయ నిర్వహణలో ఆహార భద్రతా ప్రమాణాలను పాటించని పాల విక్రయదారుల ఎడల ఫిర్యాదులను మీ సమీప ఆహార భద్రతా అధికారి వారికి తెలియజేయమని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తి మరియు విక్రయదారులు ఏ విధమైన లోటుపాట్లు ఫిర్యాదులు లేకుండా పాలు ఉపఉత్పత్తుల విక్రయాలు సమగ్రంగా చేసుకోవాలన్నారు. అధికారుల పర్యవేక్షణ తనిఖీలు సక్రమంగా ఉండేందుకు వినియోగదారుల నుండి ఫిర్యాదులు అనేవి రాకుండా ఉండేందుకు విక్రయ దారులు ఈఃూంఎ లో లైసెన్స్ నమోదు చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు ఈ సందర్భంగా సూచించారు.

# మద్యం కేసులో కీలక పరిణామం

**అవినాశ్ రెడ్డికి రెగ్యులర్ బెయిల్ మంజూరు**



**న్యూఢిల్లీ,మార్చి 20:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడైన ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. అవినాశ్‌కు సుప్రీం కోర్టు రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. మద్యం కుంభకోణం కేసులో ఏ-7గా ఉన్న అవినాశ్ రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుంది. కోర్టు అనుమతితో జరిగిన ఈ విచారణలో అవినాశ్ కీలక విషయాలు వెల్లడించినట్లు సమాచారం. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాత్ర, అంతిమ లబ్దిదారుడికి సంబంధించిన విషయాలపై అవినాశ్ రెడ్డి వివరాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ స్కామ్‌లో రాజ్ కసిరెడ్డి ప్రధాన నిందితుడిగా ఉండగా, అవినాశ్ రెడ్డి ఆర్థిక నియంత్రణ, లావాదేవీలలో ముఖ్యపాత్ర వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించి విచారణ ఇంకా కొనసాగుతోంది.

# కుటుంబ ఆస్తుల పంపకం జరగలేదు

మొదటి పేజీ తరువాయి

తమ దగ్గరి వాళ్లందరికీ తెలిసిన వాస్తవమిదని విజయలక్ష్మి అన్నారు. ఎంఓయూలో వైఎస్.షర్మిలకు రాసిన ప్రతీ ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవేనని తెలిపారు. అందుకే వైసీపీ అధినేత, తన కుమారుడు జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ఎంఓయూ రాశారని ప్రస్తావించారు. నిజానికి తనకు తక్కువే రాశారని, సరస్వతి సిమెంట్‌తో సహా ఎంఓయూలో లేని యెలహంక ల్యాండ్ కూడా షర్మిలదేనని చెప్పుకొచ్చారు. జగన్ ఇచ్చానని చెబుతున్న నగదు షర్మిల వాటాకు ఇచ్చిన డెవిడెండ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఆస్తుల విషయంలో జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశారని చెప్పుకొచ్చారు. ఎప్పటికైనా తనకు న్యాయం చేస్తారని జగన్ తల్లిగా ఆశిస్తున్నానని అన్నారు. ఇప్పటి వరకూ ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని విజయలక్ష్మి క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు చదువుతున్న షర్మిల ఆస్తుల లాంటివి వైఎస్సార్ జగన్‌కు కూడా ఇచ్చారని తెలిపారు. అది ఆస్తి పంపకం కాదని అన్నారు. నిజమేమిటో దేవుడికి, తన కొడుక్కి మాత్రమే తెలుసని చెప్పుకొచ్చారు. తమ ఆస్తులపై గోబెల్స్ ప్రచారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. మీరు ఎంత కాదన్నా దేవుడే న్యాయం చేస్తారని తెలిపారు. తమ ఆస్తులపై అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్ఆర్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నానని అన్నారు. మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించొద్దని వేడుకుంటున్నానని వైఎస్ విజయలక్ష్మి చెప్పారు.

# అతి వేగంతో డివైడర్‌ను ఢీకొన్న బైక్

**ముగ్గురు యువకుల దుర్మరణం**

**అన్నమయ్య,మార్చి 20:** అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రాణాలకు ప్రమాదం అని చెబుతున్నా వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. అన్నమయ్య జిల్లాలో కురుబల కోట మండల పరిధిలో గురువారం రాత్రి జరిగిన ఒక రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. కురుబల కోట మండలం సర్కారుతోపు సమీపంలో జరిగిన బైక్ ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బి.కొత్తకోటకు చెందిన సురేంద్రతో పాటు మదనపల్లికి చెందిన మాధవ, మహేశ్ ముగ్గురు స్నేహితులు. గురువారం రాత్రి పని నిమిత్తం మదనపల్లికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో, పట్టణ శివారులోని అమ్మచెరువుమిట్ట దాటిన తర్వాత జాతీయ రహదారిపై బైక్ నియంత్రణ కోల్పోవడంతో డివైడర్‌ను బలంగా ఢీ కొట్టారు. దీంతో బైక్ పై ఉన్న ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


# శ్రీవారికి 20 లక్షల విరాళం

**తిరుమల,మార్చి 20:** తితిదే ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం అందింది. తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు కుమారుడు అరణి మదన్ మోహన్ తమ జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున తితిదే శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలను విరాళంగా అందించారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన ముత్తా గౌతమ్ దంపతులు తితిదే శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలను విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తితిదే ఈవో ముద్దాడ రవిచంద్రకు విరాళం డీడీలను అందజేశారు.

# నేటి పదో తరగతి పరీక్ష ఎప్రిల్ 2కు వాయిదా

**అమరావతి,మార్చి20:** రంజాన్ సెలవును ఈ నెల 21వ తేదీ శనివారానికి మార్పు చేస్తూ ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మొదట మార్చి 20 న ప్రభుత్వం రంజాన్ సెలవుగా ప్రకటించింది. మతపెద్దల నిర్ణయం మేరకు 21వ తేదీ శనివారం రంజాన్ పర్వదినాన్ని నిర్వహిస్తుండటంతో ఆ రోజును సెలవుగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని తెలిపింది. కాగా శనివారం జరగాల్సిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షను వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షను ఏప్రిల్ 2 న నిర్వహించనున్నట్లు తెలిపారు.

# చంద్రగిరిలోనే తిష్టవేసిన గజరాజులు



**తిరుపతి, మార్చి 20:** చంద్రగిరి మండలం, ఎల్లంపల్లెలో ఏనుగుల మంద కలకలం రేపింది. గత వారం రోజులుగా గ్రామంలోనే గజరాజులు తిష్ఠ వేశాయి. రాత్రి వేళల్లో పంట పొలాలపై ఏనుగులు విరుచుకుపడుతున్నాయి. ఏనుగుల దాడిలో పంటలు దెబ్బతిన్నాయి. ఏనుగుల నుంచి తప్పించుకునే క్రమంలో పశువుల కాపరి ముత్తు రామయ్యకు గాయాలయ్యాయి. గజరాజుల సంచారంతో ఎల్లంపల్లె గ్రామస్తులు భయాందోళనతో బతుకుతున్నారు. ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు ఫారెస్ట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

## దేశంలో సింటర్డ్ రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ తయారీని ప్రోత్సహించేందుకు గ్లోబల్ టెండర్ ప్రక్రియ ప్రారంభం.

**న్యూ ఢిల్లీ మార్చి20( సమయం న్యూస్). :** భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ దేశంలో సింటర్డ్ రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ తయారీని ప్రోత్సహించేందుకు గ్లోబల్ టెండర్ ప్రక్రియను ప్రారంభించింది. ఈ మేరకు 6,000 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యంతో సమగ్ర తయారీ యూనిట్లు ఏర్పాటు చేయడానికి లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రతిపాదన పత్రం విడుదల చేయబడింది. ఈ టెండర్ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో, పారదర్శకమైన తక్కువ వ్యయ విధానం ద్వారా రెండు దశల్లో (సాంకేతిక మరియు ఆర్థిక బిడ్లు) నిర్వహించబడుతుంది. టెండర్ పత్రాలు 20 మార్చి 2026 నుంచి అందుబాటులో ఉన్నాయి. ప్రీ–బిడ్ సమావేశం 7 ఏప్రిల్ 2026న నిర్వహించబడుతుంది. బిడ్లు సమర్పించేందుకు చివరి తేదీ 28 మే 2026 కాగా, సాంకేతిక బిడ్లు 29 మే 2026న తెరవబడతాయి. ఈ పథకం కింద ఎంపికైన సంస్థలకు మూలధన సబ్సిడీతో పాటు అమ్మకాలపై ఆధారిత ప్రోత్సాహకాలు అందించబడతాయి. ఒక్కో సంస్థకు 600 నుండి 1,200 మెట్రిక్ టన్నుల వరకు సామర్థ్యం కేటాయించబడుతుంది. మొత్తం రూ. 7,280 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. దేశంలో పూర్తి సరఫరా శృంఖలాన్ని అభివృద్ధి చేసి దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, ప్రపంచ స్థాయి మార్కెట్‌లో భారత్‌ను ప్రధాన భాగస్వామిగా నిలపడం ఈ పథక ప్రధాన లక్ష్యం. రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్లు విద్యుత్ వాహనాలు, గాలి విద్యుత్ యంత్రాలు, ఆధునిక ఎలక్ట్రానిక్స్, అంతరిక్ష మరియు రక్షణ రంగాల్లో విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. ఈ పథకం అమలు ద్వారా దేశీయ తయారీ సామర్థ్యం పెరగడంతో పాటు స్వావలంబనకు దోహదం కలుగుతుంది.

## చేవెళ్లలో గొర్రెలు మేకల క్రయ విక్రయ సంత ప్రారంభం



**చేవెళ్ల మార్చి 20 (సమయం న్యూస్) :** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ యార్డులో గొర్రెలు, మేకల క్రయవిక్రయ సంతను చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల వారు గొర్రెలు, మేకలు, అమ్మడానికి గాని కొనడానికి గాని అందరికీ అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ సంతను రైతులు వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి యొక్క ఆదాయాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ మార్కెట్ చేవెళ్లలో ఏర్పాటు చేసుకోవడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ బంధుమిత్రులు సతీష్, మరియు మనికాంత్ ల సహకారం..

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు పది సైకిళ్ళు పంపిణీ..
- ధాత మణికాంత్ కు కృతజ్ఞతలు తెలిపిన TVV రాష్ట్ర కార్యదర్శి - రవీందర్ గౌడ్



**దుద్యాల మండలం, మార్చి,20(సమయం న్యూస్) :** దుద్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో కిసాన్ బంధుమిత్రులు సతీష్ అదే విధంగా అమెరికాలో ఉంటున్న మణికాంత్ సహకారంతో దుద్యాలలో చదివే విద్యార్థినులు అల్లికానిపల్లి జీడిగడ్డ తండా సోమ్లా నాయక్ తండ మరియు లఘుచర్ల నుండి నడుచుకుంటూ వస్తున్నందున వారి కొరకు 10 సైకిలను మణికాంత్ సహకారంతో అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ మల్లప్ప ఉపసర్పంచ్ సంజీవ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ వార్డు సభ్యులు బసిరెడ్డి రాజు అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు మెరుగు వెంకటయ్య కాజా పాషా సత్యం మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ సైకిళ్ల ధాత మణికాంత్ కు కృతజ్ఞతలు, అదేవిధంగా ధన్యవాదాలు తెలిపారు

## తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ -మిశ్రమ బడ్జెట్

- సిపిఐ MLC నెల్లికంటి సత్యం

**హైదరాబాద్ మార్చి20 ,( సమయం న్యూస్) :** ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ పట్ల సిపిఐ మీజ నెల్లికంటి సత్యం అసంతృప్తి వ్యక్తపరిచారు.

ఈ బడ్జెట్ మిశ్రమ బడ్జెట్ అని, ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు లేవని, ముఖ్యంగా పెన్షన్లు రెట్టింపు చేయలేదని, గీత కార్మికులు, యాదవులు, ముదిరాజులు, చేనేత కార్మికులు వంటి వృత్తి సంఘాలకు బడ్జెట్‌లో ప్రస్తావన లేదని పేర్కొన్నారు. విద్యకు 20% డిమాండ్ చేస్తుంటే 8% మాత్రమే కేటాయించారని, ఆరోగ్యానికి 4% మాత్రమే కేటాయించారని తెలిపారు. కొత్తగా ఇందిరమ్మ బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, నైపుణ్యాభివృద్ధిలో ఈ బడ్జెట్ దిశా నిర్దేశం చేయలేకపోయిందని ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల భర్తీపై స్పష్టత లోపించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బడ్జెట్ కేవలం అసెంబ్లీ ప్రసంగాలకి పరిమితం కాకుండా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడేలా ఉండాలని కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ తరఫున కోరుతున్నాను అని ఈ సందర్భంగా తెలిపినారు.

## బడ్జెట్ ప్రసంగం ను వాకౌట్ చేసిన బిఆర్ ఎస్ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్ మార్చి20( సమయం న్యూస్,) :** చెవిలో పూలు పెట్టుకొని వాకౌట్ చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలుబిఆర్ ఎస్ సభ్యుల ఆందోళనతో దద్దరిల్లిన శాసన సభ ప్రాంగణం

తులం బంగారం మోసం మోసం అంటూ నినాదాలురెండు లక్షల ఉద్యోగాలు మోసం మోసంబడ్జెట్ మోసం మోసం అంటూ నినాదాలు చేస్తూ శాసన సభ ఎంట్రీ వద్ద ధర్నా

## బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాతో చిట్ చాట్

- అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు గారు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.
- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంలో జరుగుతున్న భారీ కుంభకోణాన్ని ఆయన బయటపెట్టారు.
- చిట్ చాట్ లో హరీశ్ రావు కామెంట్స్...



**హైదరాబాద్ మార్చి20(సమయం న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు పూర్తి చేయగా, అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న 26 నియోజకవర్గాలకు ఇవ్వలేదు.

కక్షపూరితంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్కూళ్లు మంజూరు చేయలేదు.

కానీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు, అలాగే కొందరు బీజేపీ ఎమ్మెల్యేలకు మాత్రం స్కూళ్లు కేటాయించారు.

ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి జరుగుతోంది.

కాంట్రాక్టర్లు ఆర్గనైజ్డ్ రింగ్ గా అయ్యి పనులను పంచుకుంటున్నారు.

76 స్కూళ్లకు సంబంధించిన ప్రతి టెండర్ కి ఎక్సెస్ ధర కోట్ చేసి దక్కించుకున్నారు.

టెండర్లలో కనిష్టంగా 4.59% నుంచి గరిష్టంగా 4.96% ఎక్సెస్‌తో, నిబంధనల ప్రకారం 5% దాటకుండా పక్కా ప్లాన్‌తో కొల్లగొట్టారు.

ఒక్కో స్కూలుకు రూ. 250 కోట్లు కేటాయించగా, అందులో సివిల్ వర్క్స్ కోసమే సుమారు రూ. 150 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు.

76 స్కూళ్లకు సంబంధించి ప్రభుత్వ అంచనా వ్యయం రూ. 10,199.54 కోట్లు కాగా, కాంట్రాక్టర్లు దాన్ని రూ. 10,693.55 కోట్ల ఎక్సెస్‌తో దక్కించుకున్నారు.

అంటే కేవలం ఈ టెండర్ల ద్వారా సుమారు రూ. 494 కోట్లు ప్రజాధనాన్ని అదనంగా దోచిపెడుతున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరల్లో అత్యధికంగా 4.95% ఎక్సెస్ ధరకు టెండర్లు కేటాయించడం పలు అనుమానాలకు కలిగిస్తున్నాయి.

డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నియోజకవర్గంలో 4.95 ఎక్సెస్.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్ నగర్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గం హుస్నాబాద్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గం కొల్లాపూర్ లో 4.77 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారు.

మంత్రి కొండా సురేఖ నియోజకవర్గం వరంగల్ ఈస్ట్ లో 4.99 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారు.

మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గం నల్గొండలో 4.87 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గం ఖమ్మంలో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారు.

మంత్రి సీతక్క నియోజవర్గం ములుగులో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారు.

మంత్రి దామోదర రాజనర్సింహ నియోజకవర్గం ఆంథోల్ లో 4.99 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నియోజకవర్గం వికారాబాద్ లో 4.89 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గం మంథనిలో 4.89 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారు.

సీఎం రేవంత్ రెడ్డి గారు వాడుతున్న వాహనం ఖూా= కంపెనీ పేరు మీదనే ఉంటుంది.

ఆశ్చర్యకరంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంతో పాటు ఏకంగా 9 స్కూళ్ల టెండర్లను ఈ ప్రభుత్వం అదే ఖూా= సంస్థకు కట్టబెట్టింది.

మంత్రుల నియోజకవర్గాల్లోనే ఎక్కువ ధరకు టెండర్లు ఖరారు కావడం ఈ కుంభకోణానికి నిదర్శనం.

నాడు కేసీఆర్ గారి పదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఏనాడూ రాజకీయ పక్షపాతం చూపలేదు.

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సమానంగా ప్రాధాన్యత ఇచ్చారు.

మిషన్ కాకతీయ మొదటి దశ నుంచే, మిషన్ భగీరథ, బీసీ,మైనార్టీ గురుకులాలు ఇలా ఏ పథకమైనా 119 నియోజకవర్గాలకు సమానంగా ఇచ్చారు. మెడికల్ కాలేజీలను అన్ని జిల్లాలకు ఇస్తూ, నేటి కాంగ్రెస్ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గానికి కూడా ఇచ్చాం. దళిత బంధు లాంటి గొప్ప పథకాన్ని ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిర చింతకాని నుంచే పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఘనత కేసీఆర్ గారిది.

**అభివృద్ధిని సమానంగా చూసిన బీఆర్ఎస్ ఎక్కడ?**

కేవలం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారన్న అక్కసుతో 26 నియోజకవర్గాలకు స్కూళ్లను ఆపేసిన మీరెక్కడ?

ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంలో జరిగిన ఈ వందల కోట్ల టెండర్ల కుంభకోణంపై శాసనసభలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తాం.

నా దగ్గర ఈ స్కామ్ కు సంబంధించి ఇంకా పూర్తి ఆధారాలు, వివరాలు ఉన్నాయి. వాటన్నింటినీ అసెంబ్లీ సమావేశాల్లో సభ సాక్షిగా బయటపెడతాను.

## శ్రీ సిరికొండ మధుసూధనాచారి గారు, మండలిలో ప్రతిపక్షనేత



**హైదరాబాద్ మార్చి20( సమయం న్యూస్) :** " ప్రజల అవసరాలు గుర్తెరిగి హామీలివ్వడం, ఇచ్చిన హామీలను సమర్ధ పాలకుల లక్ష్యం. కానీ, ఈ బడ్జెట్లో ఆరు గ్యారెంటీల అమలు ఊసే లేదు, ఇది మిమ్మల్ని నమ్మి అధికారం కట్టబెట్టిన ప్రజలకు ద్రోహం చేయడమే. అందుకే ఈ బడ్జెట్ పై బీఆర్ఎస్ పక్షాన మేం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాం. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వానికి సూచన చేస్తున్నాం. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలన్నరు. ఆ ప్రస్తావనే లేదు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ గురించే లేదు. వాళ్లిచ్చిన హామీల్లో ఏ ఒక్కదాని గురించిన ప్రస్తావన లేదు, బడ్జెట్ కేటాయింపుల్లేవు. గత బడ్జెట్లో పథకాలకు కేటాయించిన నిధుల ఖర్చు టెలిస్కోప్ పెట్టి చూసినా కనిపించడం లేదు. ప్రతి ఏటా రూ.20 వేల కోట్ల ఖర్చుతో 4 లక్షల 50 వేల ఇండ్లు కట్టిస్తామన్నారు. రెండేండ్లలో వీళ్లు చేసిన కేటాయింపు రూ.7400 కోట్లే.

ఇక రైతు భరోసా ప్రస్తావనే లేదు. సమాజంలో సగభాగం ఉన్న బీసీల బతుకులతో ఈ ప్రభుత్వం చెలగాటమాడి అపహాస్యం చేస్తున్నది. బీసీలకిచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని మాట తప్పారు. బీసీ సంక్షేమానికి ఏటా 20 వేల కోట్లు ఖర్చు చేస్తామన్నరు. గత రెండు బడ్జెట్లలో ఖర్చు చేసింది ఐదారు వేల కోట్ల రూపాయలు కూడా లేదు. ఆరు గ్యారెంటీలను అమలు చేశామని ఘనంగా చెప్పుకున్నారు. కానీ, చేయూత, మహాలక్ష్మి పథకాల ప్రస్తావనే లేదు. విద్యార్థులు, నిరుద్యోగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, రైతులను దగా చేశారు. మేడారం జాతర ఘనంగా నిర్వహించామని చెప్పారు. 14 గంటల పాటు ట్రాఫిక్ జామ్ సరిదిద్దలేని ఈ ప్రభుత్వం గోదావరి పుష్కరాలను సమ్మక్క సారలమ్మ జాతర స్ఫూర్తితో చేస్తామంటున్నది. అంటే మళ్లీ అక్కడ కూడా ఈ తిప్పలు తప్పవని చెప్పినట్లా? బడ్జెట్లో ఏ అంశాలను ప్రాధాన్యతా క్రమంలో ప్రస్తావించాలో వాటి ఊసే లేకుండా చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు క్యారీ ఫార్వర్డ్ చేస్తామన్నరు. కేటాయించిన బడ్జెటే ఖర్చు చేయని ఈ ప్రభుత్వాన్ని ఎలా నమ్మమంటారు? మీ మాటల్ని నమ్మడమంటే మోసపోవడానికి సిద్ధంగా ఉండటమే. ఈ ప్రభుత్వం పలాయనవాదం కీలకమైన గవర్నర్ ప్రసంగంపై చర్చ జరపడం మానేసి, ఢిల్లీకి వెళ్లొచ్చారు. ముఖ్యమంత్రి గారు రెండున్నర గంటల ప్రసంగంలో కేసీఆర్ గారిమీద ఏడ్వటం, ఇచ్చిన హామీలు ఎగవేయడం, అడిగితే ఎదురుదాడి చేయడం, అబద్ధాలు చెప్పడం తప్ప మరేం చేశారు. సభ్యుల ప్రశ్నలకు వివరణలివ్వకుండా సభను వాయిదా వేసి, పలాయనం చిత్తగించడం దారుణం. ఈ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నాం."



## నూతన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట, మార్చి,20(సమయం న్యూస్):** నారాయణపేట జిల్లాకు ఇటీవల నూతనంగా నియమితులైన జిల్లా కలెక్టర్ శ్రీ ప్రతీక్ జైన్ ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS శుక్రవారం రోజు కలెక్టర్ కార్యాలయంలో పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా పరిపాలన, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై పరస్పరం చర్చించుకున్నారు. జిల్లాలో చట్టవ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పని చేసిజిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం దిశగా పరిపాలన మరియు పోలీస్ శాఖలు సమిష్టిగా కృషి చేస్తామని నూతన కలెక్టర్ నాయకత్వంలో జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు.





## అగ్గనూర్ వాగు నుండి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత..

- కేసు నమోదు చేసిన యాలాల ఎస్సై విఠల్
- ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు..

**యాలాల మండలం, ఫిబ్రవరి,20(సమయం న్యూస్) :** యాలాల ఎస్సై విఠల్ తెలిపిన వివరాల ప్రకారం అగ్గనూరు వాగు నుండి ఎలాంటి అనుమతి లేకుండ అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న (ఖూ34ూూ1067, ఖూ34ఱ0244 నంబర్లు కలిగి రెండు ఇసుకు ట్రాక్టర్లను స్వాధీనపరుచుకోని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైన ఎలాంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై విఠల్ తెలిపారు.

# విద్యాలయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల మార్చి 20 ( సమయం న్యూస్) :** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రంలో కొనసాగుతున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో పాఠశాల అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూరిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలు, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలనుపరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటితో పాటు నాణ్యమైన విద్య బోధన అందించాలని,పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, మురుగు కాలువల వ్యవస్థ, పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. మండల కేంద్రంలోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్ లను సందర్శించి మొక్కలు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సకాలంలో నీటిని అందించి మొక్కలను పరిరక్షించాలని తెలిపారు. ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేర-ువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, ఉపయోగకరమైన చెత్తను వేరుచేసి సెగ్రికేషన్ షెడ్లకు తరలించాలని తెలిపారు. ఈ అంశాల సమర్థవంతమైన నిర్వహణపై నిర్వాహకులను అభినందించారు. మండలంలోని చిత్తాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందిస్తూ నాణ్యమైన విద్య బోధన చేయాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి, మధ్యాహ్న భోజనం నాణ్యత, సౌకర్యాల కల్పన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకాగ్రతతో చదివి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదిగే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీ తీరును పరిశీలించి సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించిఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మొహమ్మద్ అబ్దుల్ హై, మండల పంచాయతీ అధికారి, పంచాయితీ కార్యదర్శి, సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో కలసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.



**జుక్కల్ మార్చి20( సమయం న్యూస్) :** జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం జుక్కల్ మండలంలో పర్యటించి ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ముందుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం కింద జుక్కల్ మండలంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల పనుల పురోగతిని సబ్ కలెక్టర్ కిరణ్మయి తో కలిసి పరిశీలించారు. నిర్మాణ నాణ్యత, పనుల వేగం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తదనంతరం ఆక్సిజన్ పార్క్‌ను సందర్శించి అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్క్‌లో వృక్షాల సంరక్షణ, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.ఆపై కేజీబీవీ (ఖ+దీఎ) విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు.ఈ రోజు మెనూలో క్యారెట్ కర్రీ, సాంబారు, టమాట చారు, కోడి గుడ్డు, పెరుగు, నెయ్యి అందిస్తున్నట్లు గమనించారు. ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో ముచ్చటిస్తూ వారి విద్య, వసతి, ఆహారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఇందులో పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, ఎవశీ రాజు, ఞూా మురళి, తహసిల్దార్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# జిల్లాలో తగినంత గ్యాస్ అందుబాటులో ఉంది

● ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదు.


● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




**నిర్మల్ మార్చి20( సమయం న్యూస్) :** జిల్లాలో ప్రజల అవసరాలకు సరిపడినన్ని గ్యాస్ సిలిండర్ లు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. ప్రజలెవరూ గ్యాస్ సిలిండర్ ల సరఫరాపై ఆందోళన చెందవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజలు తమ అవసరాలకు సిలిండర్ లు బుక్ చేసుకున్న నిర్ణీత గడువులోపు డోర్ డెలివరీ చేయబడతాయని చెప్పారు. గ్యాస్ సిలిండర్ల కోసం ఏజెన్సీల వద్దకు వెళ్లవలసిన పనిలేదని అన్నారు. ఎక్కడ కూడా గ్యాస్ కొరత లేదని, గ్యాస్ కొరత అంటూ వస్తున్న అసత్య వార్తలను ప్రజలు ఎట్టి పరిస్థితులలో నమ్మరాదని కలెక్టర్ ఆ ప్రకటన ద్వారా కోరారు.

# రాష్ట్ర సర్వోన్నత అభివృద్ధికి బాటలు వేసిన బడ్జెట్

● డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ప్రభుత్వ చీఫ్ విప్ (శాసన మండలి)



**హైదరాబాద్, మార్చి 20సమయం న్యూస్ :** ప్రభుత్వం 2026-27 కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తుంది. ముఖ్యంగా ప్రజాహిత అంశాలైన విద్యా, వైద్యం అలాగే వ్యవసాయ,నీటి పారుదల , రోడ్ల నిర్మాణం, పట్టణాభివృద్ధి, పారిశ్రామిక రంగాల్లో ప్రగతిశీల అభివృద్ధి తో పాటు మహిళా సంక్షేమం, యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాల, మైనారిటీ ల అభ్యున్నతికి బడ్జెట్ కేటాయింపులు హర్షణీయం. ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిసరాల్లో నిర్మాణం లో ఉన్న రేడియల్ రింగ్ రోడ్డు మూడు జిల్లాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. రాష్ట్ర వృద్ధి రేటు 10.2% గా ఉంది.ఇది జాతీయ వృద్ధి రేటు కంటే 2.7% ఎక్కువ.ఇవి రైజింగ్ తెలంగాణ కు నిదర్శనంగా నిలుస్తోంది.



## నెల రోజుల భక్తి... ఏడాదంతా స్ఫూర్తి ..

# నేడే ఈద్ ఉల్ ఫితర్

షవ్వాల్ నెలవంక తొంగి చూసింది. అత్యంత పవిత్రంగా కఠోర నియమ, నిష్టలతో కొనసాగించిన రంజాన్ నెలకు ముస్లింలు ఘనంగా వీడ్కోలు పలికారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు (రోజా)లు కొనసాగించి ఇక సంతోషంగా ఈద్ ఉల్ ఫితర్ పండుగ సంబురాలు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనం ఇవ్వడంతో ఉలేమాలు శనివారం ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు జరుపుకోవాలని ప్రకటించారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఆకలి, దప్పికల నుంచి ఓర్పు,సహనం అనే సద్గుణాలను నేర్చుకున్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే తత్వాన్ని అలవర్చుకున్నారు. 30 రోజుల పాటు చేపట్టిన దీక్షలు, ప్రార్థనలతో పొందిన నైతిక విలువలను వచ్చే ఏడాదంతా స్ఫూర్తిగా కొనసాగించడానికి సంసిద్ధులయ్యారు. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ పండుగ శనివారం భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పండుగ ప్రాధాన్యం, నెల రోజులుగా చేపట్టిన ఉపవాస దీక్షలు (రోజా)లతో నేర్చుకున్న శిక్షణ ముస్లింలందరు పాటించాలని మతపెద్దలు, ఉలేమాలు చెబుతున్నారు.

షవ్వాల్ మాసంలోని మొదటి రోజు కనిపించే నెలవంక తర్వాత ప్రత్యేక దువా చేసి ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటారు. ఈద్ ఉల్ ఫితర్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ముస్లింలు పండుగ రోజు ఉదయాన్నే తలస్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. ఈ నేపథ్యంలో ఈద్గాహ్ వద్ద భారీ ఎత్తున ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం రంజాన్ పండుగ రోజున షీర్ ఖుర్మా చేసుకొని నోరు తీపి చేసుకుంటారు. ధనికులు, పేదలు అనే తారతమ్యం లేకుండా సమాజంలోని అందరూ ఒకే విధమైన దినచర్య పాటిస్తారు. ఈ పండుగ ఆరోగ్యకర పద్ధతులు, శాంతి, సౌభాగ్యాలను నెలకొల్పుతుందని నమ్మడు. పండుగ తర్వాత మరో ఆరు రోజుల పాటు షవ్వాల్ దీక్షలు పాటిస్తారు.

**ప్రత్యేక దువా**

ముస్లింలు పండుగకు ముందు రోజు రాత్రి షవ్వాల్ నెల నెలవంక కనిపించిన తర్వాత ప్రత్యేక దువా (ప్రార్థన) చేస్తారు. అప్పటితో ఉపవాస దీక్షలు ముగుస్తాయి. ఈద్ ఉల్ ఫితర్ రోజు సూర్యోదయానికి ముందు నిద్రలేస్తారు. ఉదయం ఫజర్ నమాజ్ చేస్తారు. అందరూ సంప్రదాయ స్నానాలు (గుసుల్) చేస్తారు. అనంతరం కొత్త బట్టలు ధరిస్తారు. చాలా మంది లాల్చీ, పైజామా ధరిస్తారు. ఈద్ (పండుగ) రోజు ఉపవాసం ఉండకూడదని ఖురాన్ చెబుతోంది. ఈద్ ఉల్ ఫితర్ నమాజు కంటే ముందు 'జకాత్' చెల్లిస్తారు. ఇస్లాం ఐదు మూల స్తంభాల్లో జకాత్ నాలుగోది. పండుగ రోజున నమాజ్ కు ముందు పేదలకిచ్చే దానమే ఫిత్రా.

అందుకే ఈ పండుగకు ఈద్ ఉల్ ఫితర్ అని పేరు వచ్చింది.

**రంజాన్ స్పెషల్ 'షీర్ ఖుర్మా'...** రంజాన్ పండుగ రోజు అందరి దృష్టి షీరఖుర్మా' పైనే ఉంటుంది. పండుగ రోజు నమాజ్ ముగిశాక మిత్రులు, బంధువులు, ఆత్మీయులతో పంచుకునేందుకు వారందరిని ఇండ్లకు ఆహ్వానిస్తారు. వారికి షీర్ ఖుర్మాతో విడదీయరాని అనుబంధం ఉంది. ఉపవాసాలు, ఐదుపూటల నమాజ్, చివరి పది రోజుల్లో ఎతెఖాఫ్, షబే ఖదర్, జాగరణ రాత్రులతో నెల రోజుల పాటు ముస్లింలు ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. చివరి రోజు ఉపవాస దీక్ష ముగిసిన తర్వాత ముస్లింలు సోదరభావంతో హిందువులకూ 'షీర్ ఖుర్మా' అందిస్తారు.

**దానధర్మాలకు ప్రతీక:** రంజాన్ మాసం అత్యంత నియమ, నిష్టలతో పవిత్ర రంజాన్ మాసపు ఉపవాస దీక్షలు చేపట్టి షవ్వాల్ నెలవంక చూసిన తర్వాత ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటాం. పేదల ఆకలి బాధలు తెలుసుకొని ఈద్ నమాజ్ కు ముందే ప్రతి ఒక్కరు విధిగా ఫిత్రా, జకాత్ చెల్లించాలి. ఇదే పవిత్ర రంజాన్ మాసం ఆశయం. ప్రేమ, కరుణ, సోదరభావం, పరమత సహనం ఇస్లాం ప్రధాన ఉద్దేశం. రంజాన్ మాసమంతా అనుక్షణం సర్వ మానవాళి సుఖ సంతోషాల కోసమే ప్రార్థిస్తాం. ఇస్లాం మూల సిద్ధాంతాలు కలిమా, నమాజ్, రోజా, జకాత్, హజ్ ఐదు అంశాలపై ఉన్నాయి. ఈ నెలలో దైవ ప్రార్థన, బీదలకు తనవంతు సాయం, ప్రేమాభిమానాలతో గడిపిన జీవన విధానం మిగిలిన 11 నెలలు పాటు ఆచరించాలని పవిత్ర ఖురాన్ లో అల్లాహ్ నిర్దేశించారు. అల్లాహ్ సన్మార్గంలో ముస్లింలందరు నడవాలి.

**దివి నుంచి భువికి ఖురాన్...** ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్. ఖురాన్ గ్రంథం దివి నుంచి భూమికి ఈ మాసంలోనే వచ్చింది. ఈ నెలలో ఉపవాస దీక్షతో శరీరాన్ని శుద్ధి చేసుకోవడం ద్వారా ఆత్మ ప్రక్షాళన అవుతుంది. దీంతో మోహం, మదం, కోపతాపాలు అదుపులో ఉంటాయి. రంజాన్ మాసంలో ముస్లింలు అందరూ ఉపవాస దీక్షలు ఆచరించడం తప్పనిసరి. ఖురాన్లో సూచించినట్లుగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు 30 రోజుల పాటు పాటించే దీక్షల్లో చుక్క నీరు కూడా సేవించరు. ఇలా 30 రోజుల పాటు కఠోర నియమాలతో ఉపవాస దీక్ష చేస్తారు. ఉపవాస దీక్షలతో మనో నిగ్రహం కలుగుతుంది. ఆకలి విలువ తెలుస్తుంది. కోరికలు దహించుకుపోతాయి. ప్రేమ, అభిమానం, క్రమశిక్షణ, కర్తవ్యం తదితర గుణాలు దరి చేరతాయి. ఎన్నో ప్రత్యేకతలతో సాగే రంజాన్ మాసం ఈద్ ఉల్ ఫితర్ వేడుకలతో ముగుస్తుంది.

# ప్రజా -పాలన ప్రగతి -ప్రణాళికలు భాగంగా 99 రోజుల కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించలి-కలెక్టర్

● పురోగతిలో ఉన్న సీసీ రోడ్లు,ప్రహరీ గోడల నిర్మాణాలు మార్చి 25వ తేదీలోపు పూర్తి చేయాలి

● సంబంధిత అధికారులకు కలెక్టర్- దీపక్ తివారి ఆదేశం



**దౌల్తాబాద్ మండలం, మార్చి,20(సమయం న్యూస్) :** పురోగతిలో ఉన్న సీసీ రోడ్లు, ప్రహరీ గోడల నిర్మాణాలు మార్చ్ 25వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దిపక్ తివారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ దౌలతాబాద్ మండలంలో పర్యటించి తహసిల్దార్ కార్యాలయం లోని మరమ్మత్తు , ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రహరీ గోడ నిర్మాణ పనులను,గ్రంథాలయ నిర్వహణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని సదు పాయాలు, ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ...ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు.ఇప్పటికే మంజూరైన సీసీ రోడ్లు, ప్రహరీ గోడలు, ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయాలని, ఇప్పటికి గ్రౌండింగ్ కానీ పనులను మొదలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంటకాలను పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలని కలెక్టర్ సూచించారు.అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన క్రమంలో ఓపి, ఇన్ పేషంట్ వార్డు,టీకాల,మందుల గదిని పరిశీలించి వైద్యం నిమిత్తం వచ్చిన పేషంట్లతో కలెక్టర్ మాట్లాడారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 12 గంటలు ప్రజలకు సేవలు అందిస్తున్నారు అనే విషయం తెలుసుకొని 24 గంటల సేవల నిమిత్తం ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ డిఎంహెచ్ఓ కు తెలిపారు. జిల్లాలో ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం మంచినీటి సదుపాయానికి ఆర్.ఓ ప్లాట్లను ఏర్పాటును చేయాలని కలెక్టర్ డిఎంహెచ్ఓ కు సూచించారు. గ్రామాల్లో 100 శాతం వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

**ఉపాధ్యాయుడిగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ...** పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న క్రమంలో 10 తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుచున్నాయి. ఈ సందర్భంగా ఇంగ్లీష్ సబ్జెక్టు పై కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు విద్య పట్ల మెళుకువలను సూచించారు. విద్యార్థులందరూ బాగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, సబ్జెక్టు పరంగా ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ తో పాటు వివిధ కార్యక్రమాల్లో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఎంహెచ్ఓ స్వర్ణకుమారి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, డిఈ సుదర్శన్, హౌసింగ్ డిఈ చందర్, తహసిల్దార్ గాయత్రి, ఎంపీడీవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# "దోమల నివారణ చర్యలు"

● జిల్లా DM&HO డాక్టర్ స్వర్ణ కుమారి,

●జిల్లా కీటక జానితా వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్,...

● డాక్టర్. బుష్రా ఫాతిమా, PHC అంగడిరైచుర్ ఆదేశాల మేరకు





**కొడంగల్ మండలం, మార్చి,20(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ స్వర్ణ కుమారి, మరియు జిల్లా కీటక జనిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్. రవీంద్ర యాదవ్, డాక్టర్.బుస్రా ఫాతిమా, వైద్యాధికారి పి.హెచ్.సి అంగడిరైచుర్ ఆదేశానుసారం కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామ శివారులో గల మహాత్మ జ్యోతిభ పులే తెలంగాణ బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ గురుకుల బాలుర పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. శ్రీనివాస్ ను కలిసి వారి పర్యవేక్షణలో కొడంగల్ సబ్ యూనిట్ అధికారి ఎస్. పకిరప్ప పాఠశాలలోని అన్ని గదులు మరియు బాత్ రూమ్స్ లలో దోమల నివారణ మందు డీసీఎం (ూశ్రీజూష్టు జఎజూవతీ వీవ్‌ష్ట్రతీఅఅవ) 5% పిచికారి చేయించడం జరిగినది అనంతరం విద్యార్థులకు మరియు సిబ్బందికి దోమల వల్ల కలిగే వ్యాధులు, వాటి నివారణ చర్యలు, మరియు వక్తిగత పరిశుభ్రత ఉ పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం జరిగింది, ఇట్టి కార్యక్రమములో మధుసూదన్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్, షారు బాయి ఏటిపి. సోనీ బాయి హెచ్.ఎస్ పాల్గొనడం జరిగింది.

# విద్యార్థులకు చదరంగం మెలకువలు నేర్పండి

- **“చెస్‌తో ఏకాగ్రత -- ఆలోచనా శక్తి పెంపు”**
- **జిల్లా విద్యాశాఖాధికారి నారాయణపేట**



**నారాయణపేట, మార్చి 20 (సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం మరియు జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు ఒకరోజు చదరంగం శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఏఎంఓ విద్యాసాగర్, సిఎంఓ రాజేందర్ కుమార్, ఎస్ఓ నాగార్జున రెడ్డి, అంతర్జాతీయ చెస్ ట్రైనర్ ప్రవీణ్ కుమార్, జిల్లా చెస్ కోఆర్డినేటర్ వీరుమల్లేష్ పాల్గొన్నారు.

**“చెస్ అనేది మేధస్సును పదును పెట్టే సాధనం”**

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, చెస్ విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆలోచనా శక్తి, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించే మానసిక క్రీడ అని ఏ ఎమ్ ఓ విద్యాసాగర్ తెలిపారు.

**“మొబైల్‌కు దూరం -- పుస్తకాలకు దగ్గరం”**

చెస్ ఆడడం వల్ల విద్యార్థులు మొబైల్ వినియోగానికి దూరమై, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకుంటారని రాజేంద్ర కుమార్ పేర్కొన్నారు.

“గణితంలో లాజికల్ థింకింగ్‌కు చెస్ తోడ్పాటు”

చెస్ ద్వారా లాజికల్ థింకింగ్ పెరిగి, గణితంలో మరియు చదువులో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని నాగార్జున రెడ్డి వివరించారు.

“ప్రతి పాఠశాలలో చెస్‌కు ఒకరోజు కేటాయించాలి”

ప్రతి పాఠశాలలో వారానికి కనీసం ఒకరోజు చెస్ ఆటకు కేటాయించాలని సూచించారు.

**“ప్రతి కదలికలో ఆలోచన అవసరం”**

అంతర్జాతీయ చెస్ శిక్షణ నిపుణులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, చెస్‌లో ప్రతి కదలిక ముందస్తు ఆలోచనతో ఉండాలని, ఇది విద్యార్థుల్లో ఓర్పు, ప్రణాళికా దృష్టి, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంచుతుందని తెలిపారు. ఆయన ప్రొజెక్టర్ ద్వారా చదరంగం బోర్డు నిర్మాణం, ప్రాథమిక నియమాలు, చెస్ నోటేషన్ విధానం, పోటీలు నిర్వహణ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం సభ్యులు బొల్లం కృష్ణ కిషోర్, అరుణ్ కుమార్, మలేల మురళీధర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. చెస్ శిక్షకులు ప్రవీణ్‌ను వ్యాయమ ఉపాధ్యాయులు శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా టెక్స్ట్ బుక్ ఇంచార్జీ సాయి నాథ్ మరీయూ జిల్లా కోఆర్డినేటర్ వీర మల్లేష్, వాలంటీర్ మహిపాల్‌తో పాటు జిల్లాలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణానికి డిజైన్లు సిద్ధం చేయాలి

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం, మార్చి 20:( సమయం న్యూస్ ) :** జిల్లా పరిధిలో ఎంపిక చేసిన 9 ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా అభివృద్ధి చేసేందుకు డిజైన్స్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి తెలంగాణ పబ్లిక్ స్కూల్ పై శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 9 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ లలో ప్రస్తుత విద్యార్థుల సంఖ్య ఆధారంగా 1000, 800 మంది విద్యార్థులకు అవసరమైన తరగతి గదులను, మౌళిక వసతులు కల్పించేలాణాళిక చేయాలన్నారు. 9 పాఠశాలల లే ఔట్ లను పరిశీలించి జి౦1 పద్దతిలో అదనపు తరగతి గదులు, ల్యాబ్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, సంప్, కిచెన్, వాష్ రూమ్, ఇతర మౌళిక వసతుల కల్పనకు ప్లాన్ ను సిద్ధం చేయాల న్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అభివృద్ధి కోసం నిధులు నాబార్డ్ నుంచి వస్తాయని, నాబార్డ్ గైడ్ లైన్స్ కు అనుగుణంగా పాఠశాలలను అభివృద్ధి చేయాలని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ డిజైన్, ఉపయోగించే సామాగ్రి మంచి క్వాలిటీతో ఉండాలని, డిప్యూటీ సీఎం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకు ంటున్నారని, ఈ అంశాన్ని అధికారులు గుర్తుంచుకో వాలని అన్నారు. పబ్లిక్ స్కూల్స్ లో ఎంట్రీ గేట్, పార్కింగ్ ఏరియా, వివిధ భవనాలకు వెళ్లేందుకు మార్గాలు, ల్యాండ్ స్కేపింగ్, ప్రీ స్కూల్ బ్లాక్, గ్రౌండ్, డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్ వంటి వివిధ అభివృద్ధి పనులతో కూడిన డిజైన్లు ప్రతి పాఠశాలకు రెండు నుంచి 3 వరకు అందించాలని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ డిజైన్ మాదిరిగా పబ్లిక్ స్కూల్స్ కు కామన్ డిజైన్ తయారు చేయాలని, ప్రతి పాఠశాలకు క్షేత్రస్థాయిలో అవసరమైన మేర చిన్న, చిన్న మార్పులు చేసుకునే ఆస్కారం ఉంటుందని, ప్రతి తరగతి గదిలో మంచి వెలుతురు, గాలి వచ్చే విధంగా డిజైన్ చేయాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత మండలంకు సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా చూడాలని అన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 9 పబ్లిక్ స్కూల్స్ ను తహసిల్దార్ పరిశీలించి అవసరమైన ల్యాండ్ సర్వే చేయించి, అందుబాటులో ఉన్న పాఠశాల భూమి సరిహద్దులు ఫిక్స్ చేయాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లా పరిధిలో గుర్తించిన 9 పాఠశాలకు స్పోర్ట్స్ గ్రౌండ్, టాయిలెట్స్, అదనపు తరగతి గదులు, ప్రీ ప్రైమరీ సెక్షన్ వంటి వసతులతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. 9 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ సంబంధించి అభివృద్ధి పనుల కోసం స్కెచ్ లేఔట్ ప్లాన్స్ ఫైనల్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు .అనంతరం ఆర్కిటెక్చర్ రూపొందించిన పలు ప్రణాళికలను కలెక్టర్ పరిశీలించి తుది డిజైన్ తయారి కోసం పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి చైతన్య జైని, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సి. హెచ్. రామకృష్ణ, సంబంధిత పాఠశాలల హెడ్మాస్టర్లు, పంచాయతీ రాజ్ ఎస్. ఈ. వెంకట్ రెడ్డి, ఈఈ మహేష్ బాబు, తహసీల్దార్లు, సంబంధితఅధికారులు, పాల్గొన్నారు.

# ముద్రా లోన్ పేరుతో సైబర్ మోసం

- **రూ. 45,065 పోగొట్టుకున్న బండమీదిపల్లి వాసి.**
- **పెద్దముల్ ఎస్సై ఎం.ప్రశాంత్ వర్ధన్**




**పెద్దముల్ మండలం, మార్చి 20(సమయం న్యూస్) :** ముద్రా లోన్ ఇప్పిస్తామంటూ సైబర్ నేరగాళ్లు చేసిన ఫోన్ కాల్ నమ్మి ఒక వ్యక్తి వేల రూపాయలు పోగొట్టుకున్న సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పెద్దేముల్ ఎస్సై ఎం. ప్రశాంత్ వర్ధన్ వెల్లడించారు.

**కేసు వివరాలు:**

బండమీదిపల్లి గ్రామానికి చెందిన దుబ్బానీ శేఖర్ అనే వ్యక్తికి గత నెల 27-02-2026న ‘9046854554’ అనే నంబర్ నుండి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తనకు రూ. 5 లక్షల ముద్రా లోన్ మంజూరైందని చెప్పగా, బాధితుడు మొదట తనకు అవసరం లేదని నిరాకరించారు. అయితే, మార్చి 2వ తేదీన మళ్లీ అదే నంబర్ నుండి ఫోన్ చేసిన నేరగాడు, “ఈ రోజే ఆఖరి రోజు, వెంటనే స్పందించకపోతే లోన్ రద్దు అవుతుంది” అని నమ్మబలికాడు. దీంతో బాధితుడు లోన్ కావాలని కోరగా, నేరగాడు ఒక ెూు (వన్ టైమ్ పాస్వర్డ్) పంపిస్తానని, అది చెబితే ప్రక్రియ పూర్తవుతుందని తెలిపాడు. బాధితుడు తన ఫోన్‌కు వచ్చిన ెూుని చెప్పి చెప్పగానే, అతని ఖాతా నుండి నాలుగు విడతలుగా (రూ. 4500, రూ. 9433, రూ. 9433, రూ. 21699) మొత్తంగా రూ. 45,065 విత్ డ్రా అయ్యాయి. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, ఞు ాబు (ాఎవఅఎవత్)-2008 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**ప్రజలకు విజ్ఞప్తి:** ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ వర్ధన్ మండల ప్రజలకు పలు సూచనలు చేశారు: అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్ నమ్మి ఎట్టి పరిస్థితుల్లోనూ( ెూు), బ్యాంక్ వివరాలు చెప్పకూడదు. అపరిచిత లింకులను క్లిక్ చేయరాదు మరియు వాట్సాప్ ద్వారా వచ్చే అనుమానాస్పద అప్లికేషన్లను డౌన్లోడ్ చేయకూడదు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే, వెంటనే ‘గోల్డెన్ అవర్’ (తొలి 60 నిమిషాలు) లోపు సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930 కి ఫోన్ చేయాలి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (చీజూ=) లో ఫిర్యాదు చేయాలి. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని పెద్దముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ పేర్కొన్నారు.

# ముస్లింల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముస్లిం ఐక్య సంఘం మూడేళ్ల ప్రయాణం




**ఖమ్మం , మార్చి 20 ;( సమయం న్యూస్ ):** ముస్లింల సమగ్ర అభివృద్ధి కోసం గత మూడేళ్ల క్రితం ఆవిర్భవించిన ముస్లిం ఐక్య సంఘం . ఆ దిశగా ప్రయాణిస్తూ తోటి సంఘాలకు ఒక ఆదర్శమైన, కార్యాచరణప్రక్రియను ప్రారంభించింది. తన ల క్ష్యానికి అనుగుణంగా ప్రయాణిస్తున్న ఈ ముస్లిం ఐక్య సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్ ఇషాతి , సహా వ్యవస్థాపకులు , రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్. హుస్సేన్ సాహెబ్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్. మహమ్మద్ గౌస్ ఉద్దీన్ ల ఆధ్వర్యంలో ముస్లిం ఐక్య సంఘం ముస్లింల మన్ననలు పొందుతూ .... సాగుతోంది. విద్యా వైద్య రాజకీయ సామాజిక ఆర్థిక రంగాలలో వెనుకబాటుకు గురవుతూ ... అనేకృతతో , ఇస్లాం మౌలిక అంశాల పట్ల అవగాహన లేకుండా కునారిల్లుతున్న ముస్లింల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముస్లిం ఐక్య సంఘం ఆవిర్భా వించింది. ఖురాన్ బోధనలు , నమాజ్ , మసీదుల స్థాపన , సామాజిక సేవ దృక్ప థం తో ఏర్పడిన ముస్లిం సంఘం..మధిర నియోజకవర్గం లో ముష్టికుంట్ల మీనవోలు, దెం దులూరు ప్రాంతాలలో మసీదులను నిర్మించింది. ఉన్నత చదువుల కోసం పేద విద్యా ర్థులకు ఆర్థిక సహాయం , అదేవిధంగా నిరుపేద ముస్లింల వైద్య సేవలకు తోడ్పాటు ..ఈ మూడేళ్ల ప్రస్థానంలో ప్రతి సంవత్సరం లక్షలాది రూపాయలను వెచ్చిస్తూ .

**. వందలాదిమందికి రంజాన్ కిట్లను పంపిణీ చేస్తూ .సాగుతున్న ముస్లిం ఐక్య సంఘం ...** కేవలం ముస్లింలకు మాత్రమే కాకుండా ముస్లిమేతరుకు కూడా తన సహాయ సహకారాలను అంద చేస్తోంది. ఇటీవల మధిర మున్సిపల్ కార్మికులకు కూడా రంజాన్ కిట్టను పంపిణీ చేసింది. ఎటువంటి విరాళాలు సేకరించకుండా కేవలం సొంత నిధులతో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇంతే కాకుండా సమకాలీన సమస్యలపై అనేక రంగాలలో నిష్ణాతులైన వారిచే సభలు సమావేశాలు నిర్వహిస్తూ ... ఆధ్యాత్మిక , రాజకీయ , సామాజిక , ఆర్థిక , విద్యా , వైద్య , వాణిజ్య రగాలలో అవగాహనలు , చైతన్య కార్యక్రమాలు తలపెడుతూ తెలంగాణ రాష్ట్రంలో తనదైన ముద్ర వేస్తున్న ముస్లిం ఐక్య సంఘం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చుట్టాలని యావత్ ముస్లిం సమాజం అభిలాషి స్తోంది.

# వికారాబాద్ జిల్లా ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

- **జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపిఎస్.**



**వికారాబాద్, మార్చి,20(సమయం న్యూస్) :** క్రమశిక్షణ, దానగుణం, మరియు సహనానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను పురస్కరించుకుని వికారాబాద్ జిల్లాలోని ముస్లిం సోదరులందరికీ, వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపిఎస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నెల రోజుల పాటు అత్యంత నిష్ఠతో ఉపవాస దీక్షలు విరమించి జరుపుకునే ఈ వేడుక, జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు మరియు సమృద్ధిని నింపాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ పండుగ సమాజంలో మత సామరస్యాన్ని, సోదరభావాన్ని మరింత పటిష్టం చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణం లో జిల్లా లో పండుగలు చేసుకోవాలని ఎస్పీ తెలియజేయడం జరిగింది.

# ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన: కోస్గి సీఐ సైదులు





**కోస్గి మున్సిపల్, మార్చి,20(సమయం న్యూస్) :** రంజాన్ పండుగ సందర్భంగా నారాయణపేట జిల్లా కోస్గి టౌన్‌లోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను కోస్గి సీఐ సైదులు, ఎస్సై బాలరాజు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ...రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అలాగే ప్రజలు పోలీసులకు సహకరించి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

# ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు



**ఖమ్మం , మార్చి 20 : ( సమయం న్యూస్ ) :** శాంతికి ,సమరస్యానికి ప్రతీకగా ఇస్లాం , ధార్మిక చింతనకు , ఇహ పరలోకాల సాఫల్యానికి రంజాన్ మాసం , ఈద్-ఉల్-ఫితర్ ( రంజాన్ పర్వదినోత్సవం ) ను అత్యంత భక్తి శద్ధలతో జరుపుకుంటున్న ముస్లింలకు ఖమ్మం జిల్లా పంచాయతీ పరిషత్ చైర్మన్ ఎం ఏ. సమద్ శుక్రవారం రంజాన్ శుభాకాంక్షలు ప్రకటించారు. పవిత్ర ఖురాన్ గ్రంథంఅవతరించిన రంజాన్ మాసం , వరాల మాసమని , పూర్తి అంకితభావంతో రోజాలు , జకాత్లు , ఫిత్రాలు , ప్రత్యేక నమాజులు మొత్తం ఒక మాసం పాటు ఆచరించిన ముస్లింలకు రంజాన్ పర్వ దినోత్సవం, ఆనందోత్సవాల మధ్య జరుపుకోవడం ఆనవాయితీ. కాగా శాంతి ప్రేమ, సామరస్యం ,భావనలకు... ఈ రంజాన్ ముస్లిం సోదరులకు ప్రత్యేకమైన పర్వ దినోత్సవం అని పేర్కొన్నారు.

# రాకంచర్లలో ధర్మకర్తల ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి






**పూడూర్,మండలం, మార్చి,20(సమయం న్యూస్) :** పూడూరు మండలం రాకంచర్ల గ్రామంలోని శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నిర్వహించిన ధర్మకర్తల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు ,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# 108 లో పండంటి మగ బిడ్డను జన్మనిచ్చిన మహిళ

● 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన బంధువులు...



**కొడంగల్ మండలం, మార్చి,20 (సమయం న్యూస్) :** కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి లక్ష్మి పల్లి గ్రామానికి చెందిన శిరీష 25 సం. కొడంగల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి డెలివరీ కోసం వచ్చారు. ఆసుపత్రిలో సిబ్బంది డిలివరీ కీ ఇంకా టైం పడుతుందని చెప్పడంతో 108 లో తాండూర్ కు వెళ్లడం జరిగింది.డెలివరీ కోసం తాండూరు కు వెళ్లే దారిలో ఉడిమేశ్వరం గ్రామ సమీపంలో 108 లోనే డెలివరీ కావడం జరిగింది..పండటి మగ బిడ్డను జన్మానించడం తో పేషెంట్ బంధువువులు. 108.సిబ్బంది ఖలీమ్ మరియు శమ్ కు కృతూతజ్ఞతలు తెలిపారు.

# రోగులకు మెరుగైన వైద సేవలను అందించాలి

● జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

● దేవరకద్ర పి.హెచ్.సి, తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్.



**దేవరకద్ర మార్చి20( సమయం న్యూస్). :** ప్రభుత్వ పి. హెచ్. సి.కి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. దేవరకద్ర మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, (పి. హెచ్.సి) తహశీల్దార్ కార్యాలయం ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా (పి. హెచ్.సి) ని సందర్శించిన జిల్లా కలెక్టర్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు అన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది తో మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఎంతమంది అవుట్‌పేషెంట్లు వస్తున్నారు? ఎంత మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు? ఔషధాల స్టాక్ సరిపడ ఉన్నదా, పి. హెచ్. సి లో ప్రసూతి సేవలు ఎలా ఉన్నాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. పి. హెచ్.సి లో రోజుకు సగటున 150 నుంచి 200 మంది అవుట్‌పేషెంట్లు నమోదవుతున్నారని, 5 నుంచి 6 మందికి రోజువారీగా ఇన్‌పేషెంట్లుగా చికిత్స అందిస్తున్నామని, ప్రతి నెల సగటున 25 నుంచి 30 ప్రసవాలు నిర్వహిస్తున్నామని, గర్భిణీ స్త్రీలకు అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు సమయానికి అందించి సురక్షిత ప్రసవాలకు చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య అధికారి కలెక్టర్ కు తెలిపారు. పి. హెచ్.సి లో 'హై రిస్క్' కేసులు వచ్చినప్పుడు వాటిని గుర్తించిన వెంటనే మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్ ద్వారా తరలిస్తున్నట్లు తెలిపారు. టీకాల కార్యక్రమంపై కలెక్టర్ సమీక్షించగా ఆసుపత్రిలో తగినన్ని టీకాలు, మందులు అందుబాటులో ఉన్నాయని సిబ్బంది తెలిపారు. ఆశా కార్యకర్తల ద్వారా గ్రామాల్లో క్రమం తప్పకుండా ప్రతి బుధవారం, శనివారం రోజుల్లో మండలంలోని ఆరు కేంద్రాల్లో టీకాలు ఇస్తున్నట్లు వైద్య అధికారి కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జ్వరంతో చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారులను కలెక్టర్ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పి. హెచ్.సి లో పరిశుభ్రతపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విధంగా కొనసాగించాలని, ఆసుపత్రి పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. తహశీల్దార్ కార్యాలయం తనిఖీఅనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ భూభారతి దరఖాస్తులు, భూముల సర్వే, తదితర విషయాల గురించి అధికారులతో సమీక్షించారు. ఏవైనా దరఖాస్తులు 60 రోజులకంటే ఎక్కువ పెండింగ్లో ఉన్నాయా అని అడుగగా, తహశీల్దార్ ఏమి లేవని అన్నారు. ఈ సందర్భంగా కుల, ఆదాయ ధృవపత్రాల జారీ విషయంలో ఎలాంటి పెండింగులు ఉండకుండా వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర తహశీల్దార్ దీపిక, వైద్య అధికారి డా. శరత్, పాల్గొన్నారు.

## పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖల ప్రగతిపై

## సోషియో ఎకనామిక్ అవుట్ లుక్-2026 కీలక ప్రకటన గుడ్లు, పాలు మాంసం, చేపలు ఉత్పత్తిలో అద్భుత ముందడుగు- సోషియో ఎకనామిక్ అవుట్ లుక్-2026

**హైదరాబాద్ మార్చి20( సమయం న్యూస్):** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక లక్ష్యాలను చేరుకున్న పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖల

పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖలు రెండేళ్లలో పురోగతిని సాధించాయని సోషియో ఎకనామిక్ అవుట్ లుక్-2026 వెల్లడించింది.

20వ జాతీయ లైవ్ స్టాక్ సెన్సెస్-2019 ప్రకారం తెలంగాణలో 3.26 కోట్లు ఉన్నాయని తెలిపింది. రాష్ట్రాల ర్యాంకులవారీగా చూస్తే తెలంగాణ 8వ ర్యాంక్‌లో ఉండగా, గొర్రెల సంఖ్యలో మొదటి స్థానం, పౌల్ట్రీ 3వ ర్యాంక్ ఉందని నివేదిక ఇచ్చింది. ప్రస్తుతం సోషియో ఎకనామిక్ అవుట్ లుక్-2026 ప్రకారంలో రాష్ట్రంలో గొర్రెల సంఖ్య 190.63 లక్షలు, కోళ్ల సంఖ్య 799.99 లక్షలు, గేదేల సంఖ్య 42.26 లక్షలు, మేకల సంఖ్య 49.35 లక్షలు, ఆవులు 42.31 లక్షలు, పందులు 1.78 లక్షలు ఉన్నట్లు అవుట్ లుక్ వివరించింది. 2024-2025లో రూ.98,512 ఉన్న రాబడి, 2025-2026లో 5.1 శాతం పెరిగి రూ.1,03,525 కోట్ల టార్గెట్ ను చేరుకుందని సోషియోఎకనామిక్ సర్వే స్పష్టం చేసింది. పాడిరంగంలో అద్భుత ప్రగతి సాధించిందని సోషియో ఎకనామిక్ సర్వే వెల్లడించింది. 2024-2025లో పాల ఉత్పత్తి 5,935 వేల టన్నులు కాగా, 4.04 శాతం పెరిగి, 2025-2026లో 6,175 వేల టన్నులకు ఉత్పత్తి సాధించడమంటే తెలంగాణ పాడి రంగంలో సాధించిన ప్రగతికి అద్దం పడుతుంది. తెలంగాణలో పౌల్ట్రీ రంగానికి అధిక డిమాండ్ ఉండటమేగాక గుడ్ల ఉత్పత్తి కూడా 6 శాతానికి పెరిగింది. మాంస ఉత్పత్తిలో తెలంగాణ ముందడుగు వేస్తోంది. మాంస ఉత్పత్తిలో 6.72 శాతం రికార్డు నమోదు చేసిందని సోషియో ఎకనామిక్ సర్వే అభిప్రాయపడింది. మొత్తానికి పశుసంవర్ధక శాఖకు సంబంధించి పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తిలో తెలంగాణ పోషిస్తున్న పాత్ర కీలకమైందని సోషియో ఎకనామిక్ సర్వే-2026 వెల్లడించింది. ఈ భాగస్వామ్యమంతా తెలంగాణ గ్రామీణ ప్రాంతాలనుంచే వస్తుందని అవుట్ లుక్‌లో పేర్కొంది.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు.

● ఈ బడ్జెట్ పూర్తిగా "ఫేక్, రివిజన్, ఫ్యాబ్రికేటెడ్ బడ్జెట్"

● తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట కవితా






**హైదరాబాద్ మార్చి 20( సమయం న్యూస్). :** , రాష్ట్రంపై భారీగా అప్పులు మోపి ఒక్కో కుటుంబంపై దాదాపు రూ.9 లక్షల భారం పడేలా చేశారని తెలిపారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చినా బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు వంటి ఏ వర్గానికీ న్యాయం చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో 56 శాతం ఉన్న

ఉగాది సందర్భంగా "ప్రజా బడ్జెట్" విడుదలతెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ బడ్జెట్ పూర్తిగా "ఫేక్, రివిజన్, ఫ్యాబ్రికేటెడ్ బడ్జెట్" అని అభివర్ణించారు. ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంపై భారీగా అప్పులు మోపి ఒక్కో కుటుంబంపై దాదాపు రూ.9 లక్షల భారం పడేలా చేశారని తెలిపారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చినా బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు వంటి ఏ వర్గానికీ న్యాయం చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలకు కేవలం 4 శాతం నిధులే కేటాయించడం అన్యాయమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ఎంబీసీ మినిస్ట్రీ, కార్పొరేషన్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం లక్ష్యాలు ప్రకటించినప్పటికీ తగిన నిధులు కేటాయించలేదని, గత బడ్జెట్‌తో పోలిస్తే నిధులు తగ్గించారని చెప్పారు. అనేక పథకాలలో గతేడాది కేటాయింపులనే తిరిగి పెట్టడం వల్ల ఇది విజన్ బడ్జెట్ కాదని, "రీ-విజన్ బడ్జెట్" మాత్రమేనని విమర్శించారు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ల విషయంలో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, అంచనాలు భారీగా చూపించి వాస్తవంగా తక్కువ నిధులు తెచ్చుకుంటోందని తెలిపారు. అలాగే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, మహిళల్లో నిరుద్యోగం 50 శాతం వరకు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ, సంక్షేమ పథకాల అమలులో విఫలమైందని, తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఆహార కల్తీ వంటి ప్రజా ఆరోగ్య సమస్యలపై కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని అన్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, అమలు చేస్తున్న విధానాలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చలేదని, అందుకే దీనిని "ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వం"గా అభివర్ణిస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలపై పోరాటాలకు తెలంగాణ జాగృతి మద్దతు ఇస్తుందని తెలిపారు.

# 2027 జనాభా లెక్కలు దేశాభివృద్ధికి కీలకం

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట మార్చి20( సమయం న్యూస్.) :** 2027 జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల సమర్ధ అమలుకు కీలకమని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అధికారులు పూర్తి అవగాహనతో క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో జనాభా గణన-2027ను సమర్ధవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి సెక్షన్ క్లార్క్ లు మరియు టెక్నికల్ అసిస్టెంట్లకు మార్చి 20, 22, 23 తేదీలలో మూడు రోజుల పాటు ఇళ్ల జాబితా, గృహ గణన (నూూ) శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనాభా గణన నిర్వహణకు అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశగా ఇళ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) మరియు గృహ గణన మే 11 నుంచి జూన్ 9, 2026 వరకు, రెండో దశగా జనాభా గణన 2027 ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారు.

జనాభా గణన ద్వారా లభించే గణాంకాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదు-పాయాల ప్రణాళికలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈసారి జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొబైల్ యాప్ లు , వెబ్ పోర్టల్ ద్వారా గణన చేపడతారని, ప్రజలు స్వయంగా తమ వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.

మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహ గణన సందర్భంగా ఇంటి నిర్మాణం, పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, తాగునీరు, మురుగు పారుదల, మరుగుదొడ్లు, వంటగది వంటి సౌకర్యాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 34 ప్రశ్నలపై ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, సీపీఓ కిషన్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. జనాభా గణాంక అధికారి రవీంద్ర నాయక్ మండలాల వారీగా గణన బ్లాకుల విభజన, గణన విధానం పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి వి. రామారావు, ఉప గణాంక అధికారి ఎం. రాజేష్, బి. కోటేశ్వరరావు, పర్యవేక్షకులు దున్న శ్యామ్, మండల ప్రణాళికా గణాంక అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతి లేదు




## జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి, మార్చి 20( సమయం న్యూస్). :** జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య స్పష్టం చేశారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షలను పారదర్శకంగా, కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, డిపార్ట్మెంటల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె దిశానిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎవరూ మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని, కేంద్రంలో ఉన్న సిబ్బంది సహా ఎవరి వద్దా మొబైల్ ఫోన్లు ఉండకూడదని స్పష్టం చేశారు. పరీక్ష ప్రారంభానికి ముందు ప్రతి హాలును క్షుణ్ణంగా పరిశీలించి చూడాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి సంఘటనలు జరిగినా సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్, ఎంఈఓలదే బాధ్యత అని స్పష్టం చేశారు. సబ్జెక్ట్ టీచర్లను క్లరికల్ సిబ్బందిగా ఉపయోగించిన్నట్లయితే వారిని వెంటనే రిలీవ్ చేసి ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ షీట్లను క్లోజ్డ్ వాహనాలలో సురక్షితంగా తరలించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపాట్మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

# భేటీ బచావో పడవో కార్యక్రమంలో సెల్ఫీ విత్ డాటర్.

**భూపాల పల్లి మార్చి20( సమయం న్యూస్).** జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల ప్రకారం భేటీ బచావో -- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా "సెల్ఫీ విత్ డాటర్" కార్యక్రమాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి మల్లీశ్వరి గారు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మరియు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు తమ కుమార్తెలతో కలిసి సెల్ఫీ తీసుకుని 22 వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా పంపించవలసిందిగా కోరారు. ఎంపికైన ఉత్తమ సెల్ఫీలకు బహుమతులు అందజేయబడతాయని తెలిపారు. కావున పోటీలో పాల్గొనదలచిన వారు తమ "సెల్ఫీ విత్ డాటర్" ఫోటోను తీసుకుని, తమ పూర్తి వివరాలతో పాటు 9848920828 నంబర్‌కు పంపించగలరు. జిల్లా సంక్షేమ అధికారి మహిళలు,పిల్లలు, దివ్యాంగులు మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ,జయశంకర్ భూపాలపల్లి

## వేల కోట్లు వదులుకున్న రాజస్థాన్ రాయల్స్..

# నిర్ణయంపై చర్చలు



ఐపీఎల్ తొలి సీజన్ విజేత రాజస్థాన్ రాయల్స్ తీసుకున్న తాజా నిర్ణయం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీ విక్రయ ప్రక్రియలో భాగంగా వచ్చిన భారీ బిడ్‌ను జట్టు యాజమాన్యం తిరస్కరించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.కొలంబియా పసిఫిక్ క్యాపిటల్ పార్టనర్స్ కన్సార్టియం నుంచి దాదాపు 16 వేల కోట్ల రూపాయల భారీ ఆఫర్ వచ్చినప్పటికీ, రాజస్థాన్ రాయల్స్ దాన్ని అంగీకరించలేదు. ఇంకా ఎక్కువ విలువ కోసం ఎదురు చూస్తోందని సమాచారం.ఈ నిర్ణయంపై క్రీడా నిపుణులు మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వచ్చిన బిడ్ మంచి ధరేనని, దాన్ని తిరస్కరించడం రిస్క్‌గా మారొచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు.రాజస్థాన్ ఫ్రాంచైజీలో మెజారిటీ వాటా ఎమర్జింగ్ మీడియా వెంచర్స్ అధినేత మనోజ్ బదాలే వద్ద ఉండగా, మిగతా వాటా రెడ్‌బర్డ్ క్యాపిటల్‌కు చెందినది.ఇక మరోవైపు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ విలువ 20 వేల కోట్లకు పైగా చేరే అవకాశముందని తెలుస్తోంది. ఆ జట్టును కొనుగోలు చేసేందుకు భారీ స్థాయిలో బిడ్లు కూడా వస్తున్నాయి.2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్‌లో అండర్‌డాగ్‌గా బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ టైటిల్ గెలిచి సంచలనం సృష్టించింది. అయితే ఆ తర్వాత స్థిరమైన ప్రదర్శన ఇవ్వడంలో జట్టు వెనుకబడింది.ఇటీవలి సీజన్లలో కొంత మెరుగుపడ్డప్పటికీ, గత సీజన్‌లో మాత్రం ఆశించిన ఫలితాలు సాధించలేక లీగ్ దశలోనే నిష్క్రమించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఫ్రాంచైజీ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది.



## ‘ట్రోఫీపై కన్నేసాం’.. పంజాబ్ కింగ్స్ జెర్సీ ఆవిష్కరణలో శ్రేయాస్ అయ్యర్

ఐపీఎల్ 19వ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో జట్లంతా కొత్త జెర్సీలతో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే పలు ఫ్రాంచైజీలు తమ జెర్సీలను విడుదల చేయగా, తాజాగా పంజాబ్ కింగ్స్ కూడా తన కొత్త జెర్సీని ఆవిష్కరించింది.శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, ఫ్రాంచైజీ యాజమాన్యం కలిసి జెర్సీని విడుదల చేశారు. ఈ సందర్భంగా పేసర్ అర్షదీప్ సింగ్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన శ్రేయాస్ అయ్యర్ జట్టుపై భారీ అంచనాలు ఉన్నాయని తెలిపారు. సవాళ్లు తనకు ఇష్టమని, ప్రతి మ్యాచ్‌లో గెలవాలనే లక్ష్యంతో మైదానంలోకి దిగుతామని అన్నారు. ఈసారి తమ లక్ష్యం ఒక్కటే—ట్రోఫీని సాధించడమేనని స్పష్టం చేశారు.గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్ అద్భుత ప్రదర్శన కనబర్చినప్పటికీ, ఫైనల్‌లో స్వల్ప తేడాతో ఓడిపోవాల్సి వచ్చింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఆ మ్యాచ్‌లో ఆర్సీబీ చేతిలో పరాజయం పాలై రన్నరప్‌గా నిలిచింది.ఈసారి గత అనుభవాలను పాఠంగా తీసుకుని టైటిల్‌పై దృష్టి సారించిన పంజాబ్ కింగ్స్, కొత్త జెర్సీతో పాటు కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది.

## ‘సంజూకు మామయ్యలాంటి వాడిని’.. గంభీర్ వ్యాఖ్యలపై శశిథరూర్ వెల్లడి



భారత జట్టు స్టార్ వికెట్‌కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ గురించి టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీశాయి. సంజూను మహేంద్ర సింగ్ ధోనీతో పోల్చాల్సిన అవసరం లేదని గంభీర్ అభిప్రాయపడ్డారని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వెల్లడించడం ఈ అంశాన్ని మరింత ఆసక్తికరంగా మార్చింది.

ఇటీవల గంభీర్‌తో జరిగిన సంభాషణను ప్రస్తావించిన శశిథరూర్, సంజూ శాంసన్‌పై గంభీర్‌కు ఉన్న అనుబంధాన్ని వివరించారు. “సంజూ నాకు మామయ్యలాంటి వ్యక్తి” అని గంభీర్ చెప్పినట్లు ఆయన తెలిపారు. అంటే సంజూ ఎదుగుదలపై తాను ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నానని, అతడిని సరైన దిశలో నడిపించాలని భావిస్తున్నానని గంభీర్ చెప్పిన భావన ఈ వ్యాఖ్యల్లో స్పష్టమవుతోంది.సంజూ శాంసన్‌ను తరచుగా ధోనీతో పోల్చుతూ వస్తున్న నేపథ్యంలో, అలాంటి పోలికలు యువ ఆటగాడిపై అనవసర ఒత్తిడిని పెంచుతాయని గంభీర్ భావించినట్లు తెలుస్తోంది. ప్రతి ఆటగాడికీ తనదైన శైలి, తనదైన ప్రయాణం ఉంటుందని, ఆ వ్యక్తిత్వాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారని సమాచారం.

ఇటీవలి కాలంలో సంజూ శాంసన్ తన బ్యాటింగ్‌తో మంచి ప్రదర్శనలు ఇస్తూ జట్టులో స్థిర స్థానం కోసం పోరాడుతున్నాడు. అతని టాలెంట్‌పై ఎలాంటి సందేహం లేదని, సరైన అవకాశాలు లభిస్తే జట్టుకు కీలక ఆటగాడిగా మారగల సామర్థ్యం ఉందని క్రికెట్ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు.ఇక గంభీర్ వంటి అనుభవజ్ఞుడైన కోచ్ నుంచి ఇలాంటి మద్దతు లభించడం సంజూ కెరీర్‌కు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. యువ ఆటగాళ్లపై విశ్వాసం ఉంచి, వారికి స్వేచ్ఛనిస్తూ ఎదగనివ్వడం జట్టు భవిష్యత్తుకు కీలకమని గంభీర్ భావజాలం సూచిస్తోంది.ఈ పరిణామాల నేపథ్యంలో సంజూ శాంసన్ భవిష్యత్తు ప్రదర్శనలపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. గంభీర్ మార్గదర్శకత్వంలో అతడు మరింత మెరుగైన ఆటతీరును కనబరుస్తాడా అన్నది ఇప్పుడు చూడాల్సిన అంశంగా మారింది.



## టెన్నిస్ చాలా కష్టంగా అనిపిస్తోంది.. ఓడిపోయానంటే నమ్మలేకపోతున్నా..!

మహిళల టెన్నిస్‌లో మరో సంచలనం. ఒకప్పుడు వరల్డ్ నంబర్ 1 ఇగా స్వియాటెక్ (Iga Swiatek) మియామి ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. శుక్రవారం జరిగిన ఓపెనింగ్ మ్యాచ్‌లో ఈ టాప్ సీడ్ అనూహ్యంగా ఓటమి పాలైంది. రెండు గంటల 10 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పోలె మగ్ద లినెట్టే చేతిలో స్వియాటెక్ చిత్తైంది. ఫేవరెట్‌గా ఇంటర్ మియామి ఓపెన్‌లో బరిలోకి దిగిన ఇగా స్వియాటెక్‌కు భారీ షాక్ తగిలింది. తొలి రౌండ్‌లోనే ఘోర పరాజయం చవిచూసిందీ మూడో ర్యాంకర్. 50వ ర్యాంకర్ పోలె మగ్ద లినెట్టే తొలి సెట్ నుంచి జోరు చూపించి 6-1, 5-7, 6-3తో స్వియాటెక్‌కు చెక్ పెట్టింది. దాంతో, డబ్ల్యూటీఏ టూర్‌లో తొలి రౌండ్‌లో 73 విజయాల రికార్డుకు బ్రేకు వేసింది.

### హర్షిత్ రాణా సందేహంలోనే..

## కొత్త బౌలర్ కోసం కేకేఆర్ వెతుకులాట

కోల్‌కతా: ఐపీఎల్ సీజన్ సమీపిస్తున్న వేళ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు పెద్ద దెబ్బ తగిలింది. యువ పేసర్ హర్షిత్ రాణా ఈ సీజన్‌కు దూరమయ్యే అవకాశం కనిపిస్తోంది.ఇటీవల మోకాలికి గాయమై శస్త్రచికిత్స చేయించుకున్న హర్షిత్ రాణా ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం పొందుతున్నాడు. అతను ఎప్పుడు జట్టులో చేరతాడో స్పష్టత లేకపోవడంతో కేకేఆర్ యాజమాన్యం ఆందోళన చెందుతోంది.ఈ నేపథ్యంలో హర్షిత్ స్థానంలో కొత్త బౌలర్‌ను ఎంపిక చేసే ప్రక్రియను జట్టు ప్రారంభించింది. కొంతమంది బౌలర్లను పరిశీలిస్తున్నామని, త్వరలోనే ప్రత్యామ్నాయంపై నిర్ణయం తీసుకుంటామని జట్టు కోచ్ అభిషేక్ నాయర్ తెలిపారు.గత కొన్ని సీజన్లలో హర్షిత్ రాణా జట్టుకు కీలక ఆటగాడిగా ఎదిగాడని, అతని గైర్హాజరు జట్టుకు పెద్ద లోటేనని కోచ్ పేర్కొన్నారు. అతని స్థానాన్ని భర్తీ చేయడం సులభం కాదని కూడా స్పష్టం చేశారు.మార్చి 29న ముంబై ఇండియన్స్‌తో తొలి మ్యాచ్ ఆడనున్న కేకేఆర్, ఈ లోటును ఎలా పూరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.



## మూడో టీ20లో కివీస్ విజయం.. సౌతాఫ్రికాపై 8 వికెట్ల తేడాతో గెలుపు

ఆక్లాండ్: దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో కివీస్ 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది.ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు మాత్రమే చేసింది. కివీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆ జట్టు పెద్ద స్కోర్ చేయలేకపోయింది.తరువాత స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు కేవలం 16.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేధించింది. ఓపెనర్లు టామ్ లాథమ్, డేవాన్ కాన్వే తొలి వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు బలమైన ఆరంభాన్ని అందించారు.లాథమ్ 63 పరుగులతో అద్భుతంగా రాణించగా, కాన్వే 39 పరుగులు చేసి సహకరించాడు. ఇంకా 22 బంతులు మిగిలి ఉండగానే కివీస్ విజయాన్ని ఖాయం చేసుకుంది.బౌలింగ్‌లో లాకీ ఫెర్గూసన్ అద్భుత ప్రదర్శన కనబరిచి 4 ఓవర్లలో కేవలం 9 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. అతని కట్టుదిట్టమైన బౌలింగ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.





## యార్కర్‌తో కోహ్లీని బౌల్డ్ చేసిన భువనేశ్వర్.. వైరల్ వీడియో

**బెంగళూరు**: ఐపీఎల్ సీజన్‌కు సిద్ధమవుతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో ప్రాక్టీస్ సెషన్‌లో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుతమైన యార్కర్ బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ వేసిన పిన్‌పాయింట్ యార్కర్‌ను కోహ్లీ పూర్తిగా మిస్ అయ్యాడు. లెగ్ స్టంప్‌పై పడిన ఆ బంతిని ఆడలేకపోయిన కోహ్లీ బ్యాలెన్స్ కోల్పోయాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఇదిలా ఉండగా, ఈ సీజన్ ప్రారంభంలో ఆర్సీబీకి కొన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ కొన్ని మ్యాచ్‌లకు దూరం కానుండగా, యశ్ దయాల్ అందుబాటుపై కూడా అనుమానాలు ఉన్నాయి. దీంతో బౌలింగ్ బాధ్యతలు ఎక్కువగా భువనేశ్వర్‌పై పడనున్నాయి.గత సీజన్‌లో జట్టు విజయానికి కోహ్లీ, భువనేశ్వర్ కీలకంగా నిలిచారు. కోహ్లీ 15 ఇన్నింగ్స్‌లో 657 పరుగులు చేయగా, భువనేశ్వర్ 14 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు తీసుకున్నాడు. ఈసారి కూడా ఆర్సీబీ విజయానికి వీరిద్దరి ప్రదర్శన కీలకం కానుంది.

## ‘పుష్ప 2’లో పాత్ర కట్‌పై

# దివి వాద్యా ఆవేదన


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన ‘పుష్ప 2’ భారీ విజయాన్ని సాధించినప్పటికీ, ఇందులో నటించిన బిగ్‌బాస్ ఫేమ్ దివి వాద్యా మాత్రం తన పాత్ర విషయంలో తీవ్ర నిరాశ వ్యక్తం చేసింది. ఈ సినిమాను చూసిన తర్వాత తాను షాక్‌కు గురయ్యానని ఆమె వెల్లడించింది.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో దివి మాట్లాడుతూ, మొదట కథ చెప్పినప్పుడు తన పాత్రకు ఎక్కువ ప్రాధాన్యం ఉందని చెప్పారు అని తెలిపింది. తన క్యారెక్టర్‌పై ప్రత్యేక టీజర్ విడుదల చేయడంతో, సినిమాలో తాను కీలక పాత్రలో కనిపిస్తానని ఆశపడ్డానని పేర్కొంది. అయితే థియేటర్‌లో సినిమా చూసిన తర్వాత తన పాత్ర చాలా తక్కువగా కనిపించడం తనను తీవ్రంగా నిరాశకు గురి చేసిందని చెప్పింది.ఈ చిత్రానికి తాను దాదాపు 20 రోజుల పాటు షూటింగ్‌లో పాల్గొన్నానని, అదనంగా 10 రోజుల పాటు డబ్బింగ్ కూడా చెప్పానని దివి వెల్లడించింది. అంత సమయం కేటాయించిన తర్వాత తన పాత్రకు సరైన స్థానం దక్కకపోవడం బాధ కలిగించిందని ఆమె పేర్కొంది.పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన ఈ సినిమాలో అవకాశం రావడం గొప్ప విషయమే అయినప్పటికీ, చివరికి తన పాత్ర తగ్గిపోవడం మాత్రం నిరాశ కలిగించిందని ఆమె అభిప్రాయపడింది.బిగ్‌బాస్ తెలుగు నాలుగో సీజన్ ద్వారా గుర్తింపు పొందిన దివి వాద్యా, ఇటీవల విడుదలైన హారర్ థ్రిల్లర్ చిత్రంలో కూడా నటించింది. ప్రస్తుతం ఆమె నటించిన ఆ సినిమా ఓటీటీ వేదికలలో ప్రేక్షకులకు అందుబాటులో ఉంది.



## ‘ధురంధర్ 2’ ప్రశంసలపై

# ప్రకాష్ రాజ్ సంచలన వ్యాఖ్యలు

రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధార్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘ధురంధర్ 2’ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేస్తోంది. మొదటి భాగం విజయాన్ని కొనసాగిస్తూ ఈ సీక్వెల్‌కు ప్రేక్షకులు విశేష స్పందన చూపుతున్నారు. విడుదలైన తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా గణనీయమైన వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.అయితే ఈ సినిమాకు ఒకవైపు మంచి ప్రశంసలు దక్కుతుండగా, మరోవైపు ఇది రాజకీయ ప్రచార చిత్రమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు టాలీవుడ్ ప్రముఖ హీరోలు ఈ చిత్రాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రశంసించడం చర్చీయాంశమైంది.ఈ పరిణామాలపై ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమాపై వస్తున్న ప్రశంసల వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఉత్తర భారతదేశంలో తరచుగా కనిపించే ఒత్తిడి రాజకీయాలు ఇప్పుడు దక్షిణ చిత్రసీమలోకి కూడా ప్రవేశించాయని ఆయన పేర్కొన్నారు.అధికార పార్టీకి అనుకూలంగా ఉండే సినిమాలను ప్రోత్సహించాల్సిన పరిస్థితి స్టార్ హీరోలకు ఏర్పడుతోందని ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.





# 11 ఏళ్ల తర్వాత వెండితెరపైకి ‘ప్రేమదేశం’ హీరో..

## ఆకట్టుకుంటున్న ‘హ్యాపీ రాజ్’ ట్రైలర్

90వ దశకంలో తన స్టైల్, చిరునవ్వుతో కుర్రకారును అలరించిన లవర్ బాయ్ అబ్బాస్ మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సుమారు 11 ఏళ్ల విరామం తర్వాత ఆయన వెండితెరపై కనిపించనున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న ‘హ్యాపీ రాజ్’ చిత్రంతో అబ్బాస్ తన రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తున్నారు.ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో అబ్బాస్ పోషిస్తున్న పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. కథలో కీలకంగా నిలిచే ‘రాజీవ్’ అనే ఎన్నారై పాత్రలో ఆయన కనిపించనున్నారు. హీరోయిన్‌గా తెలుగు నటి శ్రీ గౌరీ ప్రియ నటిస్తున్నారు. ఆమె తండ్రి పాత్రలో అబ్బాస్ నటించడం విశేషం.ట్రైలర్‌లో అబ్బాస్ లుక్ చూస్తే, ఒకప్పుడు ప్రేక్షకులను మెప్పించిన ఆయన స్టైలిష్ ఇమేజ్‌ను మళ్లీ గుర్తు చేస్తున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఆయన కనిపించే తీరు పాత రోజులను గుర్తు చేస్తోంది.ఈ చిత్రానికి రాజా ఎలాంచెజియన్ దర్శకత్వం వహిస్తున్నారు. కుటుంబంతో కలిసి ఆస్వాదించదగిన వినోదాత్మక, ప్రేమకథా చిత్రంగా ‘హ్యాపీ రాజ్’ రూపొందుతోంది. పెళ్లి దశకు చేరుకునే ఒక జంటకు, వారి కుటుంబాల మధ్య చోటుచేసుకునే సరదా సంఘటనలు, భావోద్వేగాలతో కథ ముందుకు సాగుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయనుంది. ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొన్న ఈ







# విజయ్ సేతుపతి, సాయి పల్లవి జోడీ


## మణిరత్నం–రెహమాన్ మళ్లీ కలయిక..

దిగ్గజ దర్శకుడు మణిరత్నం తన ఆస్థాన సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌తో మరోసారి చేతులు కలపనున్నారు. ‘రోజా’తో ప్రారంభమైన ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ ఇప్పుడు 19వ చిత్రంతో కొనసాగనుండటం విశేషం.ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో విజయ్ సేతుపతి హీరోగా నటించనుండగా, సాయి పల్లవి హీరోయిన్‌గా కనిపించనున్నారు. సహజ నటనతో ఎలాంటి పాత్రకైనా ప్రాణం పోసే ఈ ఇద్దరు నటులు ఒకే తెరపై, అది కూడా మణిరత్నం దర్శకత్వంలో కనిపించనుండటంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఇటీవల ఈ ప్రాజెక్ట్‌పై వచ్చిన ప్రచారాల మధ్య విజయ్ సేతుపతి స్వయంగా స్పందిస్తూ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. గతంలో 2018లో విడుదలైన ‘చెక్క చివంత వానం’ (తెలుగులో ‘నవాబ్’)లో మణిరత్నంతో కలిసి పనిచేశానని, కానీ ఈసారి చేయబోయే సినిమా పూర్తిగా భిన్నంగా ఉండబోతుందని తెలిపారు. ఈ చిత్రంలో సాయి పల్లవి ఫీమేల్ లీడ్‌గా నటిస్తోందని ఆయన స్పష్టం చేశారు.మణిరత్నం వంటి గొప్ప దర్శకుడితో పని చేస్తున్నప్పటికీ, తనలోని ఆరంభ దశలో ఉన్న నటుడి తపన ఇప్పటికీ అలాగే ఉందని విజయ్ సేతుపతి భావోద్వేగంగా తెలిపారు. నటనపై తనకు ఉన్న అభిరుచి, కృషి ఎప్పటికీ మారదని చెప్పారు. మణిరత్నం సినిమాల్లో ప్రేమకథలు ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలతో ఆయన కథలను తెరకెక్కిస్తారు. ఇప్పుడు అలాంటి ప్రేమకథలో విజయ్ సేతుపతి, సాయి పల్లవి వంటి సహజ నటులు జోడీ కావడంతో ఈ చిత్రంపై ఆసక్తి మరింత పెరిగింది.ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మణిరత్నం తన నిర్మాణ సంస్థ మద్రాస్ టాకీస్‌తో పాటు లైకా ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతుండగా, రాబోయే వేసవిలో షూటింగ్ ప్రారంభం కానుంది. ప్రేక్షకులను ఆకట్టుకునే మరో అందమైన ప్రేమకథగా ఈ సినిమా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# గ్లామర్ లుక్‌లో స్మృతి మంధాన..

## సోషల్ మీడియాలో వైరల్ ఫొటోలు

టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన సరికొత్త గ్లామరస్ లుక్‌లో అభిమానులను ఆశ్చర్యపరిచారు. సాధారణంగా క్రికెట్ జెర్సీలో కనిపించే ఆమె, ఈసారి పూర్తిగా భిన్నమైన స్టైల్‌లో మెరిసి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.మార్చి 17న ఆమె పంచుకున్న ఫొటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. బ్లూ మెటాలిక్ గౌనులో స్మృతి కనిపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. అంతర్జాతీయ మోడల్‌ను తలపించేలా ఆమె లుక్ ఉండటంతో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.ప్రముఖ డిజైనర్ రూపొందించిన ప్రత్యేక మెటాలిక్ గౌనులో స్మృతి మెరిసిపోయారు. రాయల్ బ్లూ రంగులో, బాడీకి అతుక్కుపోయే డిజైన్‌తో పాటు వెనుక వైపు పొడవుగా సాగిన స్టైల్ ఆమెకు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చింది. వెలుతురులో మెరిసే ఈ డ్రెస్ ఆమె లుక్‌ను మరింత హైలైట్ చేసింది.భారీగా కనిపించే డ్రెస్సుకు తగ్గట్టుగా మేకప్, హెయిర్ స్టైల్‌ను మాత్రం సింపుల్‌గా ఉంచుకున్నారు. లైట్ మేకప్, న్యూడ్ షేడ్స్, సాఫ్ట్ హెయిర్ స్టైల్‌తో ఆమె సహజ సౌందర్యాన్ని మరింతగా ఎలివేట్ చేశారు. తక్కువ యాక్సెసరీస్‌తో స్మృతి తన లుక్‌ను పూర్తి చేశారు.క్రికెట్ మైదానం నుంచి ఫ్యాషన్ వేదిక వరకు తన స్టైల్‌తో మెప్పిస్తున్న స్మృతి మంధాన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా చర్చనీయాంశంగా మారాయి.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131